ఆంధ్రప్రదేశ్ & తెలంగాణ లో
మీకు నిజం రాసే ధైర్యం ఉందా?
అందుకు
వార్త సంధ్య మీ వేదిక!
రండి — ప్రజల గళంగా,
నిజం కోసం మాతో కలవండి.
ఇప్పుడే రిపోర్టర్ గా చేరండి
vaarthasandhya@gmail.com

RNI TGTEL/25/A5065

vaartha sandhya
# వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



SEGGEM KIRAN KUMAR
EDITOR & MD
VAARTHA SANDHYA , CM NEWS TV

Published From : Rangareddy, Hyderabad  e - paper.vaarthasandhya.com  సంపుటి : 01  సంచిక : 89  శనివారం  14 - 03 - 2026  ఎడిటర్ : సెగ్గెం కిరణ్ కుమార్  పేజీలు : 08  వెల : 6/-

Published From : Rangareddy, Hyderabad  e - paper.vaarthasandhya.com  VOLUME : 01  Issue : 89  Saturday  13 - 03 - 2026  Editor : Seggem Kiran Kumar  Pages : 08  Price : 6/-

## గ్యాస్, పెట్రోల్ కొరతకు
# కేంద్రానిదే బాధ్యత

- తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్
- కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని మంత్రి పొన్నం ధ్వజమెత్తారు
- కేంద్ర మంత్రులుగా ఉన్న కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు
- బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు
- మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్ ఉందన్నారు మంత్రి పొన్నం



**వార్త సంధ్య, హైదరాబాద్, మార్చి 13 :** ప్రస్తుతం నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్ర ప్రభుత్వ వైఫల్యమే కారణమని తెలంగాణ రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రంగా విమర్శించారు. కేంద్రం అనుసరిస్తున్న విధానాల వల్ల సామాన్యులు ఇబ్బందులు పడుతున్నారని ధ్వజమెత్తారు.దేశంలో నెలకొన్న గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే పూర్తి బాధ్యతని, అంతర్జాతీయంగా యుద్ధ వాతావరణం ఉన్న నేపథ్యంలో కేంద్రం తక్షణమే స్పందించి సరఫరాను మెరుగుపరచాలని డిమాండ్ చేశారు. తెలంగాణ నుంచి కేంద్ర మంత్రులుగా ఉన్న - మిగతా 2 లో

## మూసీ ప్రాజెక్టుకు
# బీజేపీ వ్యతిరేకం కాదు



- బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు
- అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు
- మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు
- చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు



# సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

- తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల యాజమాన్యానికి సమ్మె నోటీసులు
- ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు
- సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామన్న ఆర్టీసీ జేఏసీ
- 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది



# వారిని అంతం చేస్తున్నా

- ఇరాన్‌కు మరోసారి డొనాల్డ్ ట్రంప్ హెచ్చరిక
- ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు
- అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు

## ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన
# కాసేపటికే భారీ పేలుడు

- ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు
- పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం
- హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం
- పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు



**వార్త సంధ్య, ఢిల్లీ, మార్చి 13 :** ఇరాన్ రాజధాని టెహ్రాన్‌లో భారీ పేలుడు చోటుచేసుకుంది. పాలస్తీనాకు మద్దతుగా భారీ ఎత్తున నిర్వహిస్తున్న 'కుద్స్ డే' ర్యాలీలో ఊహించని విధంగా తీవ్ర విస్ఫోటనం సంభవించింది. ఇజ్రాయెల్ సైన్యం బహిరంగంగా హెచ్చరికలు జారీ చేసిన కొద్దిసేపటికే ఈ ఘటన జరగడం గమనార్హం.దాడికి ముందు ఇజ్రాయెల్ సైన్యం తమ అధికారిక పెర్షియన్ (ఫార్సీ) సోషల్ మీడియా ఖాతా ద్వారా మూడు మ్యాప్‌లను పంచుకుంది. టెహ్రాన్‌లోని చహర్రా-ఇ వెలియాస్ర్, మేయ్దాన్-ఇ తౌహిద్, విల్లాస్ ప్రాంతాలను ఎరుపు రంగుతో మార్క్ చేసింది. ఈ ప్రాంతాల్లో ఉన్న ప్రజలు వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని, త్వరలోనే దాడులు జరుగుతాయని చాలా స్పష్టమైన హెచ్చరికలు జారీ చేసింది.ఈ హెచ్చరికలు వెలువడిన కొద్ది సమయానికే, టెహ్రాన్ యూనివర్సిటీ వైపు వెళుతున్న కుద్స్ డే ర్యాలీ సమీపంలో పెద్ద శబ్దంతో పేలుడు సంభవించింది. పవిత్ర రంజాన్ మాసం చివరి శుక్రవారం సందర్భంగా పాలస్తీనాతో సంఘీభావం తెలుపుతూ ఇరాన్ ప్రజలు ఈ నిరసనలు చేపడుతుంటారు. పేలుడు దెబ్బకు ఆకాశంలోకి దట్టమైన పొగలు ఎగిసిపడటంతో జనం ప్రాణభయంతో పరుగులు తీశారు.ప్రస్తుతం ఈ ఘటనలో - మిగతా 2 లో

## ఈశాన్యంలో
# బీజేపీతోనే శాంతి

- కాంగ్రెస్‌వి అన్నీ స్వార్థంతో చేసుకున్న ఒప్పందాలే: మోదీ
- రెండు రోజుల అసోం పర్యటనలో ప్రధాని మోదీ
- రూ.4,570 కోట్ల విలువైన అభివృద్ధి ప్రాజెక్టులకు శ్రీకారం
- మూడు కొత్త రైలు సర్వీసులకు జెండా ఊపిన ప్రధాని
- ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు
- బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు



**వార్త సంధ్య, ఢిల్లీ, మార్చి 13 :** ఈశాన్య రాష్ట్రాల్లో శాశ్వతంగా శాంతిస్థాపనకు బీజేపీ చర్యలు చేపట్టిందని, కానీ స్వార్థ ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ వివిధ ఒప్పందాలు చేసుకుందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆరోపించారు. బాంబు పేలుళ్లు, తుపాకీ కాల్పుల మోతలు గతంలో ఈశాన్య రాష్ట్రాల్లో వినిపించేవని, కానీ డబుల్ ఇంజిన్ ప్రభుత్వాలు వచ్చాక ఇక్కడి పరిస్థితి మారిపోయిందని ఆయన తెలిపారు. ఇప్పుడు అసోం రాష్ట్రం శాంతి, అభివృద్ధిలలో కొత్త అధ్యాయాన్ని లిఖిస్తోందన్నారు.అసోంలోని - మిగతా 2 లో

## ఇక 24 గంటలూ
# షాపులు ఓపెన్..!



- ఏపీ వ్యాపారులకు గుడ్ న్యూస్
- ఏపీలోని ప్రధాన ప్రాంతాల్లో 24 గంటలూ షాపుల నిర్వహణకు అనుమతి
- సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం కీలక ఉత్తర్వులు
- ఉద్యోగులకు వారానికి 48 గంటల పని, ఓవర్ టైం చెల్లింపు తప్పనిసరి
- 20 మందికి పైగా సిబ్బంది ఉన్న సంస్థలకు లైఫ్ టైమ్ రిజిస్ట్రేషన్ అవకాశం

## రాష్ట్రంలో భారీగా
# భూ కేటాయింపులు

- పరిశ్రమలు, విద్యాలయాలకు పెద్దపీట
- ముగిసిన ఏపీ క్యాబినెట్ భేటీ
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం
- కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు
- గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదం
- మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయం



**వార్త సంధ్య, అమరావతి, మార్చి 13 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్గం పలు కీలక నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో జల జీవన్ మిషన్, పోలవరం ప్రాజెక్టు పనుల వేగవంతం, కడప స్టీల్ ప్లాంట్‌కు భూ కేటాయింపులు, గిరిజన రైతులకు సబ్సిడీలు, మహిళల కోసం హాస్టళ్లు వంటి అనేక ముఖ్యమైన ప్రతిపాదనలను ఆమోదించారు. సమావేశం అనంతరం రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి మీడియాకు కేబినెట్ - మిగతా 2 లో




# ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

- ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ ప్రమాణస్వీకారం
- లిసా గిల్ తో ప్రమాణస్వీకారం చేయించిన చీఫ్ జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్
- హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టనున్న జస్టిస్ లిసా
- న్యాయరంగంలో జస్టిస్ లిసాకు అపారమైన అనుభవం

# సంపాదకీయం

## నవ నేపాల్

ఇది జెన్‌జీ విజయం అంటున్నారంతా. నేపాలీలు గత పాలకులపట్ల ఎంత ఆగ్రహంగా ఉన్నారో బాలెన్‌షా ఘనవిజయం స్పష్టంగా తెలియచెబుతోంది. ఒక పార్టీ మూడింట రెండువంతుల మెజారిటీతో అధికారంలోకి రావడమన్నది ఆ దేశం ఎన్నడూ చూడనిది. పదిహేడేళ్ళ ప్రజాస్వామ్య చరిత్రలో , చివరకు 2008లో ప్రజాస్వామ్యానికి పునాదులు వేసిన మావోయిస్టులకు కూడా దక్కనంత అపూర్వమైన ప్రజాదరణ రాష్ట్రీయ స్వతంత్రపార్టీకి లభించింది. ఆ పార్టీ అధ్యక్షుడు రబీ లామిచేని, కాబోయే ప్రధాని బాలెన్‌షాలను భారతప్రధాని నరేంద్రమోదీ అభినందించి, పరస్పర సహకారంతో కలసి సాగుదామనడం, వారిద్దరూ చక్కగా, సానుకూలంగా ప్రతిస్పందించడం బాగుంది.సినిమా ఆఖరుఘట్టంలో దుష్టనాయకులను జనం తరిమితరిమికొట్టినట్లుగా నేపాల్ ప్రజలు తమకు నచ్చనివారిని అవమానకరమైన రీతిలో దింపేశారు. ఇది క్షణికావేశమనీ, సోషల్‌మీడియా నిషేధం ద్వారా ఖడ్గప్రసాద్ శర్మ ప్రభుత్వం కొరివితో తలగోక్కుందని అంతా అనుకున్నారు. ప్రభుత్వ ఆదేశాలు బేఖాతరు చేసిన సోషల్ మీడియా సంస్థలను చూసీచూడనట్టుగా వదిలివేసి ఉంటే నేపాల్‌లో ఏ మార్పూ ఉండేది కాదా? అన్నది అటుంచితే, ప్రజల్లో ఏళ్ళతరబడి గూడుకట్టుకొని ఉన్న నిరాశానిస్పృహలు ఒక్కసారిగా పెల్లుబుకడానికి ఆ నిషేధం దోహదం చేసింది. పాలకులు తక్షణమే ఆ నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నా, వీధుల్లోకి వచ్చిన జనం నాయకులను దించేసేవరకూ వెనక్కుపోలేదు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్నవారిని ఒక మహోద్యమంతో స్వల్పకాలంలోనే గద్దెదించేసిన ప్రజలు తగిన విచక్షణతో సరైనవారిని ఎన్నుకోగలరా? అన్న ప్రశ్నకు సమాధానంగా నేపాలీలు ఇప్పుడు బాలెన్‌షాను ముందుకు తెచ్చారు. పాతతరాన్ని వెనక్కునెట్టి, నవనాయకత్వాన్ని అధికారంలో కూచోబెట్టుకున్నారు.బాలెన్ సారథ్యంలో నేపాల్ ఒక కొత్త ప్రయాణం ఆరంభించింది. గతంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా, పహాడీలు, మధేశీలు అంటూ ఒక విభజన ఉండేది. ఇప్పుడు కొండ, లోయ ప్రాంతాలవారిద్దరూ ఒక్కటిగా బాలెన్‌కు పట్టం కట్టారు. మధేశీ, మైథిలీ మూలాలున్న వ్యక్తి ప్రధాని కావడం కూడా ఇదే మొదటిసారి. జెన్‌జీ ఉద్యమానికి నాయకత్వం వహించి నేపాలీలందరినీ ఏకతాటిపై నిలబెట్టడమేకాక, ఎన్నికలకు రెండునెలల ముందే ఆర్‌ఎస్‌పితో చేయి కలిపి దానికి ఘనవిజయాన్ని చేకూర్చడం విశేషం. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతరత్రా చిన్నా చితకా పార్టీలన్నీ ఒక్కటై బాలెన్‌ను అధికారంలోకి రాకుండా అడ్డుకుంటాయన్న భయం కూడా ప్రజల్లో ఉన్నందునే ఆయనకు ఇంతటి ఘన విజయం చేకూరి ఉంటుంది. జెన్‌జీ ఉద్యమం దెబ్బకు కకావికలైన నాయకులంతా తిరిగి ఎన్నికల బరిలో నిలవడం, పార్టీ అంతర్గత సంస్కరణల పేరిటా, హామీల పేరిటా మళ్ళీ మభ్యపెట్టే ప్రయత్నం చేయడంతో, ఎన్నికల అనంతరం వీరంతా ఒక్కటై తమ నెత్తిన కూచోకుండా ప్రజలు ముందుగానే జాగ్రత్తపడ్డారని అర్థం.అనాదిగా సంకీర్ణ ప్రభుత్వాలనే అనుభవిస్తూ వచ్చిన నేపాలీలు ఇకపై ఆ అవసరమే లేని ప్రభుత్వాన్ని ప్రతిష్ఠించుకున్నారు. ఆయా రాజకీయపార్టీల మధ్య కుట్రలకు, వాటి నాయకుల మధ్య వెన్నుపోట్లకు తావులేకుండా చేశారు. అత్యంత కీలకమైన, విధానపరమైన నిర్ణయాలకు మోకాలడ్డుతూ తమదే పై చేయి కావడంకోసం ప్రజావ్యతిరేకంగా వ్యవహరించే పార్టీలకు స్వస్తిపలికారు. దశాబ్దంన్నరకు పైగా ఏ ఒక్క ప్రభుత్వమూ ఐదేళ్ళకు మించి నిలవని దేశంలో ఒక పార్టీకి కనీవినీ ఎరుగనంత మెజారిటీ కట్టబెట్టి సుస్థిరత సాధించుకున్నారు.ఒక గాయకుడు, ఒక టీవీస్టార్ చేయీచేయీ కలిపి అధికారంలోకి రావడం



బాగున్నది కానీ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పరిపాలించడమే పెద్ద సవాల్. పాలనానుభవం లేని ఈ యువనాయకుల మీద ప్రజలు నమ్మకం పెట్టుకున్నారు. పదిహేడేళ్ళుగా తమను మోసం చేస్తున్న నాయకుల మాదిరిగా వీరు వ్యవహరించబోరని, తమను అష్టదరిద్రాలనుంచి బయటపడవేస్తారని జనం ఆశిస్తున్నారు. ప్రజలు ఎక్కువ కాలం ఓపికగా నిరీక్షించలేరన్న మాట నిజమే కానీ, వారి ఆశలన్నీ నెరవేర్చలేకపోయినా, అవినీతి, ఆశ్రితపక్షపాతాలకూ ఖర్చుదారీ విధానాలకూ దూరంగా ఉంటూ దేశాన్ని క్రమంగా గాడినపెట్టడానికి వీరిద్దరూ ప్రయత్నిస్తే అంతే చాలు. అధికారంలోకి రావడంకోసం అతివేగంగా ఒక్కటైన ఈ నాయకులు ఇద్దరూ రేపటిరోజుల్లో తమ మధ్య తలెత్తే విభేదాలను త్వరితంగా పరిష్కరించుకుంటూ ఐదేళ్ళూ కొనసాగడం మరింత ముఖ్యం.

# రాష్ట్రంలో భారీగా భూ కేటాయింపులు

మొదటిపేజీ తరువాయి -
నిర్ణయాలను వెల్లడించారు.

**భూ కేటాయింపులపై కీలక నిర్ణయాలు**

రాయలసీమ ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కడప స్టీల్ ప్లాంట్ ఏర్పాటు దిశగా ప్రభుత్వం మరో ముందడుగు వేసింది. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు పరిధిలోని పలు గ్రామాల్లో 424.45 ఎకరాల ప్రభుత్వ భూమిని జేఎస్‌డబ్ల్యూ స్టీల్ సంస్థకు కేటాయించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రూ.21.30 కోట్ల చెల్లింపుపై ఈ భూమిని ఏపీఐఐసీకి బదలాయించనున్నారు. రెండేళ్లలో ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. వీటితో పాటు కిమ్స్ ఆసుపత్రికి 2 ఎకరాలు, సంబంధిత ట్రస్టుకు 23 ఎకరాలు, తుళ్లూరు ఎడ్యుకేషన్ సొసైటీకి 3 ఎకరాలు పరిహారంగా కేటాయించారు. బాపట్ల జిల్లాలో లగ్జరీ రిసార్టుల కోసం ఏపీ టూరిజం అథారిటీకి 17 ఎకరాలు, చిత్తూరు జిల్లాలో పర్యాటక అభివృద్ధికి 20 ఎకరాలు, నెల్లూరులో ఈఎస్ఐసీ ఆసుపత్రి నిర్మాణానికి ఎకరం భూమిని కేటాయించారు. ముత్తుకూరులో సింగపూర్ కంపెనీ సీఎస్ఆర్ నిధులు రూ.20 కోట్లతో నిర్మించనున్న ఆసుపత్రి కోసం 86 సెంట్ల భూమిని నామమాత్రపు ధరకు ఇచ్చేందుకు నిర్ణయించారు.

**గిరిజన రైతులకు 100 శాతం సబ్సిడీ**

దాత్రి ఆభా జనజాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా 8 గిరిజన జిల్లాల్లోని అటవీ హక్కు పత్రాలు (ఎఫ్ఆర్ఏ) ఉన్న రైతులకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 'పర్ డ్రాప్ మోర్ క్రాప్' పథకం కింద డ్రిప్ ఇరిగేషన్‌పై 100 శాతం, స్ప్రింక్లర్లపై 90 శాతం సబ్సిడీని శాచురేషన్ పద్ధతిలో అందించేందుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. కొండ ప్రాంతాల్లో సాగు చేసే గిరిజనులకు నీటి వనరుల సమస్యను అధిగమించి, అధిక దిగుబడులు సాధించేందుకు ఈ నిర్ణయం దోహదపడుతుంది. రాష్ట్ర ప్రభుత్వం తన వాటాను 54 శాతానికి పెంచుకోవడం వల్లే ఇది సాధ్యమైందని మంత్రి వివరించారు.

**నీటి కాలుష్య నివారణ చట్టానికి ఆమోదం**

కేంద్ర ప్రభుత్వం రూపొందించిన 'నీటి కాలుష్య నివారణ, నియంత్రణ సవరణ చట్టం-2024'ను రాష్ట్రంలోనూ అమలు



చేసేందుకు మంత్రివర్గం ఆమోదం తెలిపింది. ఈ కొత్త చట్టం ప్రకారం, చిన్న చిన్న ఉల్లంఘనలకు విధించే జైలు శిక్షలను తొలగించి, వాటి స్థానంలో జరిమానాలు మాత్రమే విధిస్తారు. ఈ చట్టాన్ని ఆమోదించడం ద్వారా రాష్ట్రంలోని కాలుష్య నగరాలకు 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం' కింద కేంద్రం నుంచి నిధులు పొందేందుకు, పరిశ్రమలపై ఫీజుల భారం తగ్గించుకునేందుకు వీలు కలుగుతుంది.

**ఉద్యోగినుల కోసం 'సఖీ నివాస్' హాస్టళ్లు**

మిషన్ శక్తి పథకం కింద రాష్ట్రంలో ఉద్యోగాలు చేసే మహిళల కోసం 'సఖీ నివాస్' పేరుతో 30 వర్కింగ్ ఉమెన్స్ హాస్టళ్లను ఏర్పాటు చేయాలని కేబినెట్ నిర్ణయించింది. సురక్షితమైన వసతితో పాటు, చిన్న పిల్లలున్న తల్లుల సౌకర్యార్థం ఈ హాస్టళ్లలో క్రెష్ (శిశు సంరక్షణ కేంద్రం) సదుపాయాన్ని కూడా కల్పిస్తారు. ఉద్యోగినులు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీటిని ఏర్పాటు చేయనున్నారు. ఒక్కో హాస్టల్ నిర్వహణకు 8 మంది సిబ్బందిని అవుట్ సోర్సింగ్ పద్ధతిలో నియమిస్తారు.

**వ్యాపారులకు జీఎస్టీ ట్రైబ్యునల్స్**

జీఎస్టీ సంబంధిత వివాదాల పరిష్కారాన్ని సులభతరం చేసేందుకు, వ్యాపారులకు సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం అన్ని అప్పీళ్లను విజయవాడలోనే విచారిస్తుండటంతో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీన్ని నివారించేందుకు విశాఖపట్నం, తిరుపతి, విజయవాడలలో మూడు అప్పిలేట్ ట్రైబ్యునల్ కార్యాలయాలను నోటిఫై చేసేందుకు కేబినెట్ ఆమోదించింది. దీనివల్ల కేసులు త్వరగా పరిష్కారమై రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం కూడా సకాలంలో అందుతుంది.

**జల జీవన్ మిషన్‌కు భారీగా నిధులు**

ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో చేపట్టిన జల జీవన్ మిషన్ (జేజేఎమ్) పథకం గడువు ముగిసినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వ చొరవతో కేంద్రం దానిని 2028 వరకు పొడిగించింది. ఈ నేపథ్యంలో, వివిధ పథకాల కింద నిధులు సమకూర్చుకుని రూ.9,355 కోట్ల విలువైన ఏడు భారీ ప్రాజెక్టులకు మంత్రివర్గం పరిపాలన ఆమోదం తెలిపింది. అలాగే, తీవ్ర నీటి ఎద్దడి ఎదుర్కొంటున్న 3000 నివాస ప్రాంతాలకు రూ.1,814.71 కోట్లతో తాగునీటి పనులు చేపట్టేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టుల ద్వారా 76 మండలాల్లోని 65 లక్షల మందికి లబ్ధి చేకూరనుంది.

**కొత్తగా కేంద్రీయ విద్యాలయాలు**

రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఊతమిస్తూ మూడు కొత్త కేంద్రీయ విద్యాలయాల (కేవీ) ఏర్పాటుకు మంత్రిమండలి ఆమోదం తెలిపింది. ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం రాఘవాపురంలో 5 ఎకరాలు, ఏలూరు జిల్లా నూజివీడులో 7 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లా పలాస మండలం పురుషోత్తపురంలో 5 ఎకరాల చొప్పున భూమిని కేంద్రీయ విద్యాలయ సంఘటన్‌కు కేటాయించారు. బదిలీలపై వచ్చే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలతో పాటు స్థానిక విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం దీని ముఖ్య ఉద్దేశం.

**పోలవరం పనుల వేగవంతానికి ఆమోదం**

రాష్ట్ర జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు పనులను మరింత వేగవంతం చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. కాంట్రాక్ట్ గడువు జూన్ 2027 వరకు ఉన్నప్పటికీ, పనులను త్వరగా పూర్తి చేసే లక్ష్యంతో మూడో గ్యాంట్రీ క్రేన్‌ను ఏర్పాటు చేసేందుకు అంగీకరించింది. ప్రాజెక్టులో లైనింగ్ పనులతో పాటు, సుదీర్ఘకాలం పనులు నిలిచిపోవడం వల్ల దెబ్బతిన్న రాతి పొరల వద్ద భద్రతా చర్యలు చేపట్టనున్నారు. ఈ అదనపు పనుల కోసం ప్యాకేజీ-63ఏ కు రూ.23.47 కోట్లు, ప్యాకేజీ-64ఏ కు రూ.24.51 కోట్ల అదనపు వ్యయానికి కేబినెట్ ఆమోదం తెలిపిందని మంత్రి పార్థసారథి వివరించారు.

# ఏపీ హైకోర్టు జడ్జిగా జస్టిస్ లిసా గిల్

మొదటిపేజీ తరువాయి -
ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లిసా గిల్ బాధ్యతలు స్వీకరించారు. హైకోర్టులోని మొదటి కోర్టు హాలులో జరిగిన కార్యక్రమంలో ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆమెతో ప్రమాణం చేయించారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 3వ స్థానంలో కొనసాగుతుండగా, ఆమెను ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము ఇటీవల ఆమోదం ముద్ర వేశారు. హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సీనియారిటీలో 2వ స్థానంలో కొనసాగుతారు.హైకోర్టు ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ ఏప్రిల్ 24న పదవీ విరమణ చేయనున్నారు. ఆ వెంటనే జస్టిస్ లిసా గిల్ హైకోర్టు సీజేగా ఆ స్థానంలో కొనసాగుతారు. ఏపీ హైకోర్టు తొలి మహిళా ప్రధాన న్యాయమూర్తిగా ఆమె రికార్డు సృష్టించనున్నారు. హైకోర్టులో మొత్తం 37 మంది న్యాయమూర్తుల నియామకానికి ఆమోదం ఉండగా, ప్రస్తుతం ఆ సంఖ్య 33 ఉంది. తాజాగా జస్టిస్ లిసా గిల్ రాకతో ఆ సంఖ్య 34కు చేరింది.హైకోర్టు న్యాయమూర్తి విశేషాలు ఇవే: హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ లిసా గిల్ స్వస్థలం చండీగఢ్. అక్కడి కార్మెల్ కాన్వెంట్ స్కూల్‌లో పాఠశాల విద్య అభ్యసించారు. ప్రభుత్వ మహిళా కాలేజీలో హ్యూమానిటీస్‌లో డిగ్రీ చదివారు. పంజాబ్ యూనివర్సిటీలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం పూర్తి చేశారు.జస్టిస్ లిసా గిల్ 1990లో న్యాయవాదిగా పేరు నమోదు చేసుకుని, పంజాబ్-హరియాణా హైకోర్టులో ప్రాక్టీస్ ప్రారంభించారు. సివిల్, క్రిమినల్, రెవిన్యూ, రాజ్యాంగ పరమైన కేసుల ద్వారా అన్ని రంగాల్లో అనుభవం గడించారు. ఆమె సుదీర్ఘ కాలం పాటు చండీగఢ్‌కు పలు కార్పొరేషన్లు, ప్రభుత్వ రంగ బోర్డులకు ప్రాతినిధ్యం వహించారు. అనంతరం 2014 మార్చి 31న పంజాబ్-హరియాణా హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులయ్యారు. పంజాబ్-హరియాణా హైకోర్టులో జస్టిస్ లిసా గిల్ సేవలు అందించారు.నియామకం 2 నెలలు ముందుగానే: సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ నేతృత్వంలో ఇటీవల కొలీజియం సమావేశమైన విషయం తెలిసిందే. ప్రస్తుత హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి (జజీ) సీజే పదవీకాలం ఏప్రిల్ 24తో ముగుస్తుంది.ఈ నేపథ్యంలో జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా 2 నెలల ముందుగానే బదిలీ చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి (జజీ)గా ఉన్న జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్ బాధ్యతల నుంచి వైదొగిలిన వెంటనే జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ సీజేగా ప్రతిపాదిస్తూ కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.నూతన సంప్రదాయానికి శ్రీకారం: రాష్ట్ర హైకోర్టు ప్రధాన న్యాయమూర్తుల నియామకానికి సంబంధించి సుప్రీంకోర్టు కొలీజియం నూతన సంప్రదాయానికి శ్రీకారం చుట్టింది. ప్రస్తుత సీజేల పదవీ విరమణ కాలం ముగియడానికి 2 నెలల ముందే, ఆ స్థానంలోకి కొత్త న్యాయమూర్తి పేరును ప్రతిపాదించాలని నిర్ణయించింది.న్యాయ పరిపాలన వ్యవస్థను బలోపేతం చేసి దాని సామర్థ్యం, నాణ్యతను పెంచేందుకు ఈ విధానం ఉపయోగపడుతుందని కొలీజియం పేర్కొంది. ఈ విధానం వల్ల హైకోర్టు సీజేగా బాధ్యతలు చేపట్టే లోపు ఆ హైకోర్టు వాతావరణానికి అలవాటు పడటానికి వీలవుతుందని పేర్కొంది. దీనిలో భాగంగా జస్టిస్ లిసా గిల్‌ను ఏపీ హైకోర్టుకు న్యాయమూర్తిగా తొలుత బదిలీ చేశారు. ప్రస్తుత సీజేగా ధీరజ్ సింగ్ ఠాకూర్ పదవీ విరమణ చేసిన వెంటనే ఆమె ఆ స్థానంలో నియమితులుకానున్నారు.

# ఈశాన్యంలో బీజేపీతోనే శాంతి

మొదటిపేజీ తరువాయి -
కోక్రఝుర్ జిల్లాలో బీజేపీ ఏర్పాటు చేసిన బహిరంగ సభను ఉద్దేశించి గువహటి నుంచి ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రసంగించారు. కోక్రఝుర్‌లో జరిగే సభకు మోదీ వెళ్లాల్సి ఉండగా, అకస్మాత్తుగా వర్షం కురవడంతో ఆయన ప్రయాణానికి ఆటంకం కలిగింది. స్థానికుల భూములను చొరబాటుదారులకు కట్టబెట్టడం ద్వారా భారత జాతీయ భద్రతను కాంగ్రెస్ పార్టీ ప్రమాదంలోకి నెడుతోందని మోదీ విమర్శించారు. అందుకే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని శిక్షించి, ఈ దేశంలో చొరబాటుదారులకు చోటు లేదనే స్పష్టమైన సందేశాన్ని ఇవ్వాలని అసోం ప్రజలకు పిలుపునిచ్చారు.కాంగ్రెస్ పార్టీ అనేది అబద్ధపు హామీల దుకాణమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ విమర్శించారు. రాజకీయ ప్రయోజనాల కోసం సమాజంలోని వివిధ వర్గాల ప్రజల మధ్య హస్తం పార్టీ చీలికలను సృష్టిస్తోందని ఆయన మండిపడ్డారు. బోడోల్యాండ్‌కు చెందిన చాలా తరాల ప్రజలను కాంగ్రెస్ పార్టీ తప్పుడు కలల ప్రపంచంలో ఉంచి కాలయాపన చేసిందన్నారు. కేంద్రంలో, అసోంలో బీజేపీ అధికారంలోకి వచ్చాకే బోడో శాంతి ఒప్పందంపై సంతకాలు జరిగాయని ప్రధాని మోదీ గుర్తుచేశారు. దీని ద్వారా అన్ని ప్రధాన సంస్థలు, గ్రూపులను ఏకతాటిపైకి తెచ్చామన్నారు. "కాంగ్రెస్‌కు చెందిన అబద్ధపు హామీల దుకాణంలో ప్రతీ అబద్ధపు హామీతో పాటు నాలుగు సూపర్ అబద్ధాలను బోనస్ గిఫ్టుగా ఇస్తుంటారు. ఎందుకంటే ఆ హామీలను నెరవేర్చాలనే ఉద్దేశమే కాంగ్రెస్ పార్టీకి ఉండదు. బీజేపీ అసోంలో గెలిచాకే, బోడోల్యాండ్‌లో శాంతి, వికాసం మొదలయ్యాయి. బోడో వర్గం ప్రజలు భాషను, సంస్కృతిని కాపాడుకుంటున్న తీరును తలుచుకుంటే నాకు గర్వంగా అనిపిస్తుంది. మీ ప్రేమకు నేను రుణపడిపోయాను. ఇక్కడ అభివృద్ధి పనులు చేసి ఆ రుణాన్ని తీర్చుకుంటాను. కొన్నివారాల క్రితం, బోడో సంస్కృతితో ముడిపడిన కార్యక్రమాలను చూసే అవకాశం నాకు గువాహటిలో లభించింది. 2020 అగ్రిమెంట్‌లో భాగంగా మేం ఇచ్చిన హామీలన్నీ ఒకదాని తర్వాత ఒకటిగా అమలుచేసి తీరుతాం. బోడో భాషకు ఇప్పటికే సహ అధికార భాష హోదాను ఇచ్చాం. బోడోల్యాండ్ వికాసానికి రూ.1,500 కోట్ల ప్రత్యేక ప్యాకేజీని ఇచ్చాం. ప్రస్తుతం కోక్రఝుర్‌లో ఒక మెడికల్ కాలేజీ కూడా ఉంది. ఇళ్లకు తిరిగొచ్చిన కుమారుల తల్లులు అందరూ నాకు దీవెనలు ఇస్తున్నారు. ఆ యువకులంతా ఇప్పుడు కుటుంబాలతో సంతోషంగా, శాంతితో జీవిస్తున్నారు" అని ప్రధాని మోదీ తెలిపారు.అసోంలోని కోక్రఝుర్ జిల్లాకు సంబంధించిన రూ.4,570 కోట్లు విలువైన అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ ప్రారంభించారు.కోక్రఝుర్ జిల్లా బాష్‌బరీలో రైల్వేశాఖకు చెందిన పీరియాడిక్ ఓవర్ హాలింగ్ (పీఓహెచ్) వర్క్‌షాప్ పనులకు ప్రధాని మోదీ శుక్రవారం పునాది రాయి వేశారు. ఈ ప్రాజెక్టు వల్ల స్థానికంగా రైళ్ల నిర్వహణ సదుపాయాలు అందుబాటులోకి వస్తాయి. ఉద్యోగ అవకాశాలు ఏర్పడతాయి.ప్రధాని పచ్చజెండా ఊపి కోక్రఝుర్ జిల్లాతో పాటు ఈశాన్య రాష్ట్రాల మధ్య కనెక్టివిటీని పెంచే మూడు కొత్త రైలు సేవలకు శ్రీకారం చుట్టారు. ఈ మూడు రైలు సర్వీసుల్లో కామాఖ్య - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్, గువహటి - న్యూ జల్‌పాయ్‌గురి ఎక్స్‌ప్రెస్, నారంగి - అగర్తలా ఎక్స్‌ప్రెస్ ఉన్నాయి.కామాఖ్య - చర్లపల్లి అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ అనేది ఈశాన్య రాష్ట్రాలతో దక్షిణ భారతదేశాన్ని లింక్ చేస్తుంది.ఈ కొత్త రైలు సర్వీసులు అసోంలో టూరిజం, రవాణా, వ్యవసాయం, గ్రామీణ వికాసాలకు ఊతం ఇస్తాయి.అసోం మాలా 3.0 అనే ప్రధానమైన రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టు పనులకు ప్రధాని మోదీ శుక్రవారం భూమిపూజను నిర్వహించారు. రూ.3,200 కోట్లు విలువైన ఈ ప్రాజెక్టు ద్వారా అసోంవ్యాప్తంగా 900కుపైగా కి.మీ రోడ్లను నిర్మించనున్నారు. నేషనల్ హైవేలను, గ్రామీణ రోడ్లతో అనుసంధానించనున్నారు.బోడోలాండ్ టెర్రిటోరియల్ కౌన్సిల్ ఏరియాలో 6 రోడ్డు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజను నిర్వహించారు. ఇందులో భాగంగా రూ.1,100 కోట్లతో నాలుగు ఫ్లై ఓవర్లు, రెండు బ్రిడ్జీలను నిర్మించనున్నారు.అసోంలోని సిల్చార్‌లో వివిధ ప్రాజెక్టులకు ప్రధాని మోదీ భూమి పూజ నిర్వహించనున్నారు. పనులు పూర్తయిన పలు ప్రాజెక్టులను దేశానికి అంకితం ఇవ్వనున్నారు. ఈ ప్రాజెక్టుల మొత్తం విలువ దాదాపు రూ.23,550 కోట్లు.వచ్చే (ఏప్రిల్) నెలలోనే అసోంలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయి. ఈనేపథ్యంలో రెండు రోజుల పర్యటన కోసం శుక్రవారం రోజే అసోంకు ప్రధాని మోదీ చేరుకున్నారు. ఇప్పటికే వరుసగా రెండు అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయ దుందుభి మోగించింది. ఈసారి ఎన్నికల్లోనూ గెలిచి, వరుసగా మూడోసారి అసోం అధికార పీఠాన్ని కైవసం చేసుకోవాలనే సంకల్పంతో మోదీసేన ఉంది.

# ఇక 24 గంటలూ షాపులు ఓపెన్..!

మొదటిపేజీ తరువాయి - ఏపీలోని వ్యాపారులకు రాష్ట్ర ప్రభుత్వం తీపికబురు అందించింది. సులభతర వాణిజ్యంలో భాగంగా రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాల్లో దుకాణాలు, వాణిజ్య సంస్థలను 24 గంటలూ నిర్వహించుకునేందుకు అనుమతిస్తూ కీలక ఉత్తర్వులు జారీ చేసింది. 4 లక్షలు అంతకంటే ఎక్కువ జనాభా ఉన్న ప్రాంతాల్లో ఈ నిబంధన వర్తిస్తుందని స్పష్టం చేసింది.రాష్ట్ర కార్మిక శాఖ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేసింది. షాపులు, వాణిజ్య సంస్థల చట్టం-1988లోని కొన్ని నిబంధనల నుంచి మినహాయింపు ఇస్తూ ఈ నిర్ణయం తీసుకుంది. అయితే, ఈ వెసులుబాటు కల్పిస్తూనే ఉద్యోగుల సంక్షేమానికి సంబంధించి ప్రభుత్వం కొన్ని స్పష్టమైన నిబంధనలను విధించింది. ప్రతి ఉద్యోగితో వారానికి గరిష్ఠంగా 48 గంటలు మాత్రమే పని చేయించాలని, ఆ సమయం మించితే తప్పనిసరిగా ఓవర్ టైం జీతం చెల్లించాలని ఆదేశించింది.అలాగే, ఉద్యోగులందరికీ వారానికి ఒక రోజు సెలవు ఇవ్వాలని స్పష్టం చేసింది. ప్రభుత్వ సెలవు దినాల్లో పని చేయించాల్సి వస్తే, అందుకు బదులుగా మరో రోజు ప్రత్యామ్నాయ సెలవు మంజూరు చేయాలని పేర్కొంది. దీంతో పాటు 20 మంది లేదా అంతకంటే ఎక్కువ సిబ్బంది ఉన్న సంస్థలు లైఫ్‌టైమ్ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ పొందేందుకు కూడా కార్మిక శాఖ అనుమతించింది. ఈ నిర్ణయంతో రాష్ట్రంలో వాణిజ్య కార్యకలాపాలు మరింత పెరిగే అవకాశం ఉండగా, అదే సమయంలో ఉద్యోగుల హక్కులకు భద్రత కల్పించడం గమనార్హం.

# వారిని అంతం చేస్తున్నా

మొదటిపేజీ తరువాయి - అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి ఇరాన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. అమెరికా అధ్యక్షుడిగా వారిని అంతం చేస్తున్నానని ట్రంప్ వ్యాఖ్యానించారు. మతిచెడిన నేతలకు ఈరోజు ఏం జరుగుతుందో మీరే చూస్తారని అన్నారు. ఇరాన్ నౌకాదళం ఇప్పటికే కనుమరుగయ్యిందని, ఇక వైమానిక దళం కూడా ఉండదని హెచ్చరించారు. క్షిపణులు, డ్రోన్లు పూర్తిగా ధ్వంసం అవుతున్నాయని ఆయన అన్నారు. ఇప్పటికే వారి నాయకులు తుడిచిపెట్టుకుపోయారని అన్నారు. అక్కడి పాలకులు 47 ఏళ్ళుగా అమాయకులను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. అందుకే అగ్రరాజ్యం అధ్యక్షుడిగా వారి అంతు చూస్తున్నానని ట్రంప్ అన్నారు. ఇదిలా ఉండగా, అమెరికాకు చెందిన రీఫ్యూయలింగ్ విమానం కేసీ-135 ట్యాంకర్ ఉత్తర ఇరాక్‌లో కుప్పకూలింది. ఈ ఘటనలో నలుగురు సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. ప్రమాదం సమయంలో విమానంలో ఆరుగురు ఉన్నారు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయని, ఘటనకు దారి తీసిన చర్యలపై దర్యాప్తు చేస్తున్నామని అమెరికా మిలిటరీ సెంట్రల్ కమాండ్ తెలిపింది.

# ఇజ్రాయెల్ వార్నింగ్ ఇచ్చిన కాసేపటికే

మొదటిపేజీ తరువాయి - ఎంతమంది ప్రాణాలు కోల్పోయారు, ఎంతమంది గాయపడ్డారు అనే దానిపై ఇరాన్ ప్రభుత్వం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు. సంఘటనా స్థలంలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఇరాన్, ఇజ్రాయెల్ మధ్య తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న తరుణంలో.. ఇజ్రాయెల్ ముందస్తు హెచ్చరికలు చేసిన వెంటనే ఈ పేలుడు జరగడం పశ్చిమాసియాలో మరింత ఆందోళనను రేకెత్తిస్తోంది.

# సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

మొదటిపేజీ తరువాయి - తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు. సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది.2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# గ్యాస్, పెట్రోల్ కొరతకు కేంద్రానిదే బాధ్యత



మొదటిపేజీ తరువాయి -కిషన్ రెడ్డి, బండి సంజయ్‌లు ఈ కొరతపై రాష్ట్ర ప్రజలకు సమాధానం చెప్పాలని, వారు తమ బాధ్యతను విస్మరిస్తున్నారని విమర్శించారు.మూసీ నదిని అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడానికి ప్రభుత్వానికి ఒక స్పష్టమైన విజన్ ఉందని, ఈ ప్రాజెక్టుపై ఉన్న అన్ని అనుమానాలను పీపీటీ ద్వారా నివృత్తి చేస్తామని తెలిపారు. మూసీ పరివాహక ప్రాంతాల్లోని నిర్వాసితులకు ప్రభుత్వం అన్ని విధాలా న్యాయం చేస్తుందని, వారిని ఇబ్బంది పెట్టే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. మహాత్మా గాంధీ మనవడు తుషార్ గాంధీకి మూసీ ప్రాజెక్టుపై ఎవరో తప్పుడు సమాచారం ఇచ్చారని, అందుకే ఆయన ఆందోళన వ్యక్తం చేస్తున్నట్లు కనిపిస్తోందని అభిప్రాయపడ్డారు.బీజేపీకి రాష్ట్రంలో ఒక అజెండా, దేశంలో మరో అజెండా ఉందని పొన్నం ప్రభాకర్ ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆర్టీసీ కార్మికులకు తీవ్ర అన్యాయం జరిగిందని, బీఆర్ఎస్ నేతలకు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించే నైతిక హక్కు లేదని మండిపడ్డారు. ఆర్టీసీలో ఎలక్ట్రిక్ బస్సుల ప్రవేశం అనేది కేంద్ర ప్రభుత్వ నిర్ణయమని, దీనిపై అనవసర రాద్ధాంతం చేయవద్దని సూచించారు.

# మూసీ ప్రాజెక్టుకు బీజేపీ వ్యతిరేకం కాదు



మొదటిపేజీ తరువాయి - మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టుపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు తమ పార్టీ వైఖరిని స్పష్టం చేస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. తాము మూసీ నది శుద్ధికి లేదా అభివృద్ధికి ఎప్పుడూ వ్యతిరేకం కాదని, కానీ అభివృద్ధి పేరుతో పేద, మధ్యతరగతి ప్రజల ఇళ్లను కూల్చడాన్ని మాత్రం తీవ్రంగా వ్యతిరేకిస్తామని స్పష్టం చేశారు. మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన విమర్శలకు కౌంటర్‌గా మాట్లాడిన ఆయన, మూసీ నది హైదరాబాద్ నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని బీజేపీ కోరుకుంటోందని తెలిపారు. అయితే, 'గాంధీ సరోవర్' వంటి ప్రాజెక్టుల కోసం మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించుకున్న ఇళ్లను కూల్చడం అంగీకారయోగ్యం కాదని, ఇళ్లకు నష్టం కలగకుండానే నదిని శుద్ధి చేయవచ్చని ఆయన సూచించారు.గుజరాత్‌లోని సబర్మతి రివర్ ఫ్రంట్ ప్రాజెక్టును ఉదాహరణగా తీసుకునే వారు, అక్కడ నరేంద్ర మోదీ అనుసరించిన విధానాలను గమనించాలని రాంచందర్ రావు హితవు పలికారు. అక్కడ సుమారు 4 వేల కుటుంబాలకు ముందుగా పునరావాసం కల్పించి, ప్రత్యామ్నాయ గృహాలు ఇచ్చిన తర్వాతే ప్రాజెక్టు పనులు చేపట్టారని గుర్తుచేశారు. ప్రజల జీవితాలను దెబ్బతీయకుండా చేసేదే నిజమైన అభివృద్ధి అని అన్నారు. గాంధీ విగ్రహాన్ని ఎంత ఎత్తులో నిర్మించినా తమకు అభ్యంతరం లేదని, కానీ పేదల జీవనాధారాన్ని దెబ్బతీస్తే మాత్రం పోరాటం తప్పదని హెచ్చరించారు.మరోవైపు, దేశంలో ఇంధన కొరతపై కాంగ్రెస్ నేతలు చేస్తున్న వ్యాఖ్యలను ఆయన బాధ్యతారాహిత్యంగా అభివర్ణించారు. అంతర్జాతీయంగా యుద్ధ ఉద్రిక్తతలు ఉన్నప్పటికీ ప్రధాని మోదీ, విదేశాంగ మంత్రి జైశంకర్ ఇప్పటికే సంబంధిత దేశాలతో మాట్లాడి చమురు సరఫరాకు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారని తెలిపారు. భారతదేశం కేవలం ఒక ప్రాంతంపైనే ఆధారపడదని, 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచి వస్తుందని చెప్పారు. రవాణాలో స్వల్ప ఆలస్యాలు ఉండొచ్చని, కానీ గ్యాస్, పెట్రోల్ కొరత మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే హామీ ఇచ్చిందని, ప్రజల్లో అనవసర భయాందోళనలు సృష్టించడం సరికాదని ఆయన పేర్కొన్నారు.

RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక
నిజం నిర్భయంగా మీ ముందుకు



# ల్యాబ్ టెక్నీషియన్ ల సేవలు అభినందనీయం



**జగిత్యాల జిల్లా బ్యూరో రిపోర్టర్ ఫిబ్రవరి 13(వార్త సంధ్య):** రాయికల్ పట్టణంలోని ప్రపంచ టెక్నీషియన్ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్ విధులు నిర్వహిస్తున్న సంతోష్ గౌడ్ ను సామాజిక సేవకులు బత్తిని నాగరాజు చేతుల మీదుగా ఘనంగా శాలువ తో సన్మానించారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాబ్ టెక్నీషియన్ ల సేవలు అభినందనీయం అని రోగా నిర్ధారణ లో ల్యాబ్ టెక్నీషియన్ ల కీలకంగా మారాయి అని అన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బోద్దులశివ కుమార్, బాపురపు రాజీవ్,కొత్త పెల్లి సంజీవ్ ,రాచకొండ వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు

# చలో స్టేషన్ ఘన్పూర్ పిలుపు

## కాన్సీరామ్ జయంతి సందర్భంగా యుద్ధభేరి పోస్టర్ ఆవిష్కరణ



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 13 (వార్తా సంధ్య) :** ఈనెల 15వ తేదీన బహుజన సమాజ్ పార్టీ వ్యవస్థాపకులు మాన్యవర్ కాన్సీరామ్ జయంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర జోన్-2 ఆధ్వర్యంలో స్టేషన్ ఘన్పూర్‌లో నిర్వహించనున్న బహుజన యుద్ధభేరి బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కొత్తగూడెం కార్పొరేషన్ పరిధిలోని పాల్వంచ అంబేద్కర్ విగ్రహం వద్ద మహబూబాబాద్ పార్లమెంట్ ఇంచార్జ్ తాండ్ర వెంకటేశ్వర్లు యుద్ధభేరి పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహుజనుల సమస్యలు తీరాలంటే రాజ్యాధికారం సాధించడం ఒక్కటే మార్గమని పేర్కొన్నారు. భారతదేశ బహుజనులకు రాజ్యాధికార రుచిని చూపించిన అపర మేధావి, రాజకీయ దురంధరుడు కాన్సీరామ్ అని కొనియాడారు. ఆయన బాటలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలందరూ ఐక్యంగా ముందుకు సాగి రాజ్యాధికారాన్ని సాధించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ ఇంచార్జ్ కోళ్లపూడి ప్రవీణ్, పాల్వంచ పట్టణ అధ్యక్షుడు కాలువ ప్రవీణ్, నియోజకవర్గ నాయకులు ముషీర్, మాజీ బూర్గంపాడు మండల అధ్యక్షురాలు భూక్య సుజాత తదితరులు పాల్గొన్నారు. మీకు కావాలంటే ఇంకా పేపర్ స్టైల్‌లో చిన్నగా లేదా పెద్దగా కూడా మార్చి ఇస్తాను.

# బోయిన్ పేట్ సమస్యలు పరిష్కారించాలని మంత్రి శ్రీధర్ బాబు కి వినతి పత్రం అందజేసిన

## 6వార్డ్ కౌన్సిలర్ పోతరవేని శ్రీలతక్రాంతి



**పెద్దపల్లి, మంథని, మార్చి 13 (వార్త సంధ్య) :** మంథని మున్సిపల్ సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న తెలంగాణ రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు కి 6వ వార్డ్ కౌన్సిలర్ పోతరవేణ శ్రీలత క్రాంతి బోయిన్ పేట్ లోని పలు సమస్యల మీద వినతి పత్రం అందజేశారు. కల్లు మండువా నుండి బొక్కల వాగు వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో కలిసి 20 ఫీట్ల సీసీ రోడ్డు నిర్మాణం, బోయిన్ పేట్ లోని గల్లీలలో మిగిలి ఉన్న సీసీ రోడ్ల నిర్మాణం, బోయిన్ పేట్ కు 3 మంచి నీటి బోర్లు వేయాలని,బోయిన్ పేట్ లో నిరుపేదలు ఎక్కువగా ఉండడం వల్ల ఇందిరమ్మ ఇండ్లు అధికంగా మంజూర్ చేయాలని, వీటికి సానుకూలంగా స్పందించిన మంత్రి తప్పకుండా పరిస్కారిస్తామని హామీ ఇచ్చారని పోతరవేని శ్రీలత క్రాంతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# 16 నుంచి ఒంటి పూట బడులు....

## జిల్లా విద్యాశాఖ అధికారి జి.శారద

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి13( వార్త సంధ్య) :** ఈ నెల 16 నుంచి ఒంటి పూట బడులు నిర్వహించనున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి జి. శారద శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని సమస్త ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు , ప్రభుత్వ ఆమోదం పొందిన ప్రైవేటు పాఠశాలలు, కేజీబీవీ స్కూల్స్, ఆదర్శ పాఠశాలలు రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు మార్చి 16 నుంచి ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు ఒంటి పూట బడులు నడపాలని తెలిపారు. పాఠశాలల్లో పదవ తరగతి పరీక్ష కేంద్రం ఉన్నట్లయితే మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పాఠశాలలను నడపాలని, ఇట్టి నిబంధనలు ఏదైనా పాఠశాల యాజమాన్యం ఉల్లంఘించినట్లు దృష్టికి వస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని జిల్లా విద్యాశాఖ అధికారి ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# తెలంగాణ ప్రభుత్వం రాజేంద్రనగర్‌లో ప్రతిష్టాత్మకంగా హైకోర్టు భవన సముదాయం నిర్మాణం చేపట్టింది.

## ప్రస్తుతం ఈ ప్రాజెక్టులో భాగంగా జోన్-Xలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఇన్‌స్టిట్యూషనల్ భవనాల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి.





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చ్ 13 :** అదే విధంగా జోన్-××లో సుమారు 60 ఎకరాల భూమిని ముఖ్య న్యాయమూర్తి న్యాయమూర్తుల కోసం అవసరమైన సౌకర్యాలతో కూడిన నివాస విల్లాల నిర్మాణానికి కేటాయించారు. ఈ నివాస విల్లాల నిర్మాణానికి 05-04-2026న భూమిపూజ (గ్రౌండ్ బ్రేకింగ్) కార్యక్రమం నిర్వహించాలని న్యాయవ్యవస్థ అధికారులు నిర్ణయించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నాడు గౌరవ ముఖ్య న్యాయమూర్తి అపరేష్ కుమార్ సింగ్ న్యాయమూర్తులు రోడ్లు-భవనాల శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్ కలిసి నిర్మాణ స్థలాన్ని సందర్శించారు. కార్యక్రమానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేపట్టాలని రోడ్లు-భవనాల శాఖ అధికారులకు సూచించారు. అలాగే పనులు వేగంగా ముందుకు సాగేందుకు కాంట్రాక్టర్ సంస్థ కన్సల్టెంట్ సంస్థ . ప్రతినిధులతో కలిసి సమన్వయం చేసుకుని అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

# మాజీ డీజీపీ హెచ్.జె.దొర మృతికి సంతాపం వ్యక్తం చేసిన ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 13 :** దొర కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసిన సీఎం రేవంత్ రెడ్డిఉమ్మడి రాష్ట్రంలో ఇంటెలిజెన్స్ చీఫ్‌గా, డీజీపీగా ఆయన సేవలను గుర్తు చేసుకున్న సీఎం. పోలీసు శాఖలో పలు సంస్కరణలు తీసుకురావడంతో పాటు శాఖను ప్రజలకు చేరువ చేయడంలో ఆయన ఎంతో కృషి చేశారన్న సీఎం.

# 16 నుంచి బడ్జెట్ సమావేశాలు



**హైదరాబాద్, ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 13 ::** ఈనెల 16 వ తేదీ నుండి అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ప్రారంభమవుతున్నందున ఇప్పటి వరకు వచ్చిన ప్రశ్నలకు సంబంధించిన సమాధానాలు వెంటనే సమర్పించాలని అన్ని విభాగాల ఉన్నతాధికారులను రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె రామకృష్ణ రావు ఆదేశించారు. అసెంబ్లీ సమావేశాల ప్రారంభం నేపథ్యంలో పెండింగులో ఉన్న ప్రశ్నలకు రావాల్సిన సమాధానాలు, సమావేశాల నిర్వహణ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శులతో సి.ఎస్ టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా సి.ఎస్ రామకృష్ణా రావు మాట్లాడుతూ, శాసన మండలి, శాసనసభ సమావేశాల నేపథ్యంలో గౌరవ సభ్యులు అడిగిన ప్రశ్నలన్నింటికీ రేపటిలోగా సమాధానాలు పంపించాలని అన్నారు. ప్రధానంగా, నీటిపారుదల, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపల్ పరిపాలన, ఇంధనశాఖ, రెవిన్యూ తదితర శాఖలకు సంబంధించి అధికంగా ప్రశ్నలున్నాయని, వీటన్నింటికీ వెంటనే సమాధానాలు పంపాలని అన్నారు. బడ్జెట్ సమావేశాలు గవర్నర్ ప్రసంగం తో ప్రారంభమవుతాయన్నారు. బడ్జెట్ సమావేశాల నిర్వహణపై గౌరవ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రివర్యులు ఆదివారం నాడు ప్రత్యేక సమావేశం నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్యకార్యదర్శులు, కార్యదర్శులు, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# గెలుపు మార్పుకు నాంధి వలకాలి

## సమాజ వికాసం కోసం ప్రజా ప్రతినిధులు పనిచేయాలి

## శిక్షణా తరగతుల్లో ప్రొ. కోదండరామ్





**భద్రాద్రి జిల్లా బ్యూరో మార్చి 13 (వార్త సంధ్య) :** ప్రజాస్వామిక పద్ధతుల్లో సాధించిన గెలుపు సమాజ మార్పుకు నాంధి వలకాలని ప్రొ. కోదండరామ్ అన్నారు. రాజ్యాంగానికి లోబడి జవాబుదారీ పాలనను అందిస్తూ ప్రజల హక్కులను రక్షించడంతో పాటు పేదరిక నిర్మూలనకు కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. భారతకమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) పక్షాన గెలుపొందిన కార్పోరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉపసర్పంచుల రెండు రోజుల రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం పాల్వంచ సుగుణా గార్డెన్స్లో ప్రారంభమైంది. సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, కొత్తగూడెం మేయర్ గణేష్ అధ్యక్ష వర్గంగా వ్యవహరించిన శిక్షణా తరగతుల్లో కోదండ రామ్ మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు ముఖ్యంగా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు రాజకీయ దృక్పదంతో పాటు ప్రత్యేక లక్ష్యం ఉండాలని, కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పనితీరు ఉద్యమాన్ని నిలబెట్టాలని సూచించారు. ఒకప్పుడు ప్రజాప్రభుత్వాలు ఉండేవి కావని, దేవుని అనుగ్రహం ఉన్న వారు మాత్రమే పాలకులు అవుతారని నమ్మేవారని, కానీ రానురానూ వచ్చిన మార్పుతో దేవునితో సంబంధం లేని మానవతా వాదంతో ఒక వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. సమస్యల పరిష్కారం కోసం పనిచేసే విధంగా స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకున్నాయని కోదడం రామ్ తెలిపారు. మనల్ని మనమే పరిష్కారం కోసం పనిచేసే విధంగా స్థానిక ప్రభుత్వాలు రూపుదిద్దుకున్నాయని కోదడం రామ్ తెలిపారు. మనల్ని మనమే పరిపాలించుకునే విధానంతోపాటు అధికారమార్పిడి కూడా ప్రారంభమైందన్నారు. ఓట్లు వేసే అధికారం రావడం, అన్నింటికీ మించి సర్వజనీన వయోజన ఓటు హక్కుతో మార్పులు ప్రారంభమయ్యాయని ఆయన తెలిపారు. రాజ్యాంగానికి లోబడి పాలన జవాబుదారీతనంతో కూడిందై ఉండాలన్నారు. కీలక నిర్ణయాల్లో ప్రజలకు భాగస్వామ్యం కల్పించడం ద్వారా ఓ మంచిపాలన అందించొచ్చని ఆయన సూచించారు. ప్రజలను భాగస్వామ్యం చేసే ప్రక్రియలో భాగంగానే కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయన్నారు. 1992వ సం.లో వచ్చిన 73,74 రాజ్యాంగ సవరణ స్థానిక సంస్థలకు కొత్త అధికారాలను తీసుకొచ్చిందని, నేరుగా నిధులు రావడంతో పాటు ఎన్నికల నిర్వహణ తప్పని సరైందని ఆయన తెలిపారు. గ్రామ పంచాయితీల్లో వ్యత్యాసాలు లేనివిధంగా అందరికీ సమాన హక్కులు కల్పించేందుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలన్నారు. మార్పు తధ్యమని, 1965వ సం. తర్వాత రైతాంగ ఉద్యమాల ఫలితంగా ప్రశ్నించే తత్వం ప్రారంభమైందని, ఆదిపత్య దోరణి స్థానే, రాజకీయ వ్యవస్థ రూపుదిద్దుకుందన్నారు. స్థానికంగా ఎన్నికైన వారు అత్యంత క్రియాశీలకంగా వ్యవహరించాలని, ప్రధానంగా నిధుల వినియోగంలో పారదర్శకంగా వ్యవహరించాలని ఆయన సూచించారు. ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పుకు కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులు కృషి చేయాలని అటువంటి రాజకీయాలను ప్రోత్సహించాలన్నారు. నిధులు, విధుల కు చైతన్యం తోడైతేని సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని, తద్వారా స్థానిక సంస్థలు బలోపేతం అవుతాయన్నారు.



**రాజకీయాలే నమన్యగా మారాయి - ప్రొ. హరగోపాల్ :**

రాజకీయమంటే సమాజ సమస్యలను అర్థం చేసుకుని పరిష్కరించడమని, కానీ ఇప్పుడు రాజకీయమే ఒక సమస్యగా మారిందని ప్రొ. హరగోపాల్ తెలిపారు. సిపిఐ ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో హర గోపాల్ మాట్లాడుతూ ఎన్నికల్లో డబ్బు ప్రాధాన్యత పెరగడం నైతికత లోపించడం తదితర కారణాలతో రాజకీయాలు కలుషితమయ్యాయని ఆయన అన్నారు. ప్రజాస్వామ్య పద్ధతుల్లో అధికారం అంటే సమాజం నుంచి పొందడం అని, అలాంటి అధికారాన్ని సమాజాభివృద్ధికి, ప్రజల జీవన విధానంలో మార్పుకు దోహదపడేలా కృషి జరగాలన్నారు. చైతన్యం ద్వారా మార్పు వస్తుందని, మార్క్స్ చెప్పినట్లుగా సమాజం నిరంతరం మారుతూ ఉంటుందని ఆయన తెలిపారు. మానవసంబంధాల్లో మార్పులు త్వరిత గతిన సంభవిస్తున్నా యని, ఒకరిపై ఒకరికి నమ్మకం లేకపోవడం తో మానవ సంబంధాలు బలహీన పడి ఒక ప్రశ్నగా మారుతు న్నాయ న్నారు. ముందుగా మనిషి పరిపూర్ణ మానవునిగా ఎదగడమే గొప్ప మార్పు అని హరగోపాల్ స్పష్టం చేశారు. మనిషి సృష్టించిన సంపద సృష్టించిన వానికి దక్కడం లేదని, వేర్వేరు వ్యక్తుల వద్ద అది కేంద్రీకృతమవు తోందన్నారు. బలప్రయోగం రాజ్యాంగ లక్షణం అని తెలిపారు. ఈ సమాజం తల్లితండ్రి శిక్షించ లేక పోయినా రాజ్యాంగానికి శిక్షించే అధికారం ఇచ్చిందని ఆయన తెలిపారు. నమాజ మార్పు చైతన్యవంతమైన మనిషితో సమక్రమ మార్గంలో జరుగుతుందని హరగోపాల్ తెలిపారు. ఇప్పుడు స్వార్థమే మనిషిని నడుపుతోందని మానవ సంబంధాలు మానవీయంగా మారకపోతే మరింత ప్రమాదమన్నారు. కమ్యూనిస్టు ప్రతినిధుల ద్వారానే సమాజ మార్పు త్వరిత గతిన సాధ్యమవుతుందని హరగోపాల్ తెలిపారు. కమ్యూనిస్టు ప్రజాప్రతినిధులకు అభివృద్ధి ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పార్టీ గౌరవాన్ని ఇనుమడింప జేయాల్సిన బాధ్యత ఉందన్నారు. మౌళిక వసతుల కల్పన, ముఖ్యమంగా విద్యావైద్యం, తాగునీరు తదితర విషయాలకు ప్రాధాన్యతనిచ్చి మన తర్వాత కూడా కమ్యూనిస్టు ప్రజాప్రతినిధుల పాలనే బాగుందనిపించేలా పాలన సాగాలన్నారు.ఈ శిక్షణ తరగతుల ను స్థానిక శాసన సభ్యులు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రారంభించగా, సిపిఐ జాతీయ కార్యదర్శి డా.కే నారాయణ, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు,. మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బెడవాడ వెంకటేశ్వర్లు, ముత్యాల విశ్వనాథం, కల్లూరి వెంకటేశ్వరరావు, కర్రె బిక్షపతి, ప్రముఖ వైద్యులు సూర్యదేవర రామ్మోహన్ రావు, రిటైర్డ్ ప్రిన్సిపల్ సిద్దులు తదితరులు పాల్గొన్నారు. మునిగడప పద్మ, ఉమ, వాసిరెడ్డి మురళీ తదితరులు స్టీరింగ్ కమిటీగా వ్యవహరించారు.

# ఎల్పిజి గ్యాస్ సరఫరాకు అంతరాయం కలగకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలి

## కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుకల ప్రవీణ్



**పెద్దపల్లి, మంథని, మార్చి 13 (వార్త సంధ్య) :** కేంద్రప్రభుత్వం ప్రజలపై గ్యాస్ ధరలు పెంచి భారంవేయడం సరైనది కాదని, పెంచిన గ్యాస్ ధరలు వెంటనే తగ్గించాలని శుక్రవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎరుకల ప్రవీణ్ డిమాండ్ చేశారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి అంతరాయం లేకుండా అందించలని, వినియోగదారుల కొనుగోలు గడువు గతంలో పట్టణలల్లో 20 రోజుల వ్యవది నుండి 25 రోజులకు, గ్రామాలలో 45 రోజులకు పెంచడం ప్రజలకు, హాస్టల్ లకు, ఫంక్షన్స్ కు, గుడిలో భక్తులకు నిత్య అన్నధాన, ప్రసాదలకు,హాస్పిటల్ రోగులకు భోజనాలు ఇబ్బందిగా మారిందని, కేంద్రప్రభుత్వం పునరాలోచన చెయ్యాలని,అమెరికా ట్రంప్ బెదిరింపులకు మోడీ తలోగ్గవద్దని, దేశ ప్రజలంత కేద్ర ప్రభుత్వనికి బాసటగా ఉంటారని ప్రవీణ్ తెలిపారు.

# మొల్లమాంబ జయంతి సందర్భంగా వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్‌ల పంపిణీ



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 13 (వార్తా సంధ్య) :** మొల్లమాంబ జయంతిని పురస్కరించుకుని అశ్వాపురం మండలంలో కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో వృద్ధాశ్రమంలో పండ్లు, బ్రెడ్‌లను పంపిణీ చేశారు. మొల్లమాంబ గారి ఆశయ సాధన కోసం కృషి చేస్తున్నామని కుమ్మరి సంఘం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో కుమ్మరి సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మల్లెల ఉషారాణి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు భాదిష శంకర్ రావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆమెదా రేణుక, అశ్వాపురం మండల అధ్యక్షులు కొత్తపల్లి సత్యనారాయణ, పాల్వంచ మండల అధ్యక్షులు గుడిమెట్ల సత్యనారాయణ పాల్గొన్నారు. అలాగే బొడ్డుపల్లి పల్లవి, సూర్యనారాయణ, గంగాధర కృష్ణ, మాడుగుల వెంకటేశ్వర రావు, బొడ్డుపల్లి రాము, కానుగుల సూర్యనారాయణ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కేంద్రంలో గర్భవతికి కన్నుల పండువగా సీమంతం కార్యక్రమం

## పాల్గొన్న 55వ డివిజన్ నూతన కార్పొరేటర్ హరిహరన్



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 13 (వార్తా సంధ్య):** 55వ డివిజన్ కూలీలైన్ 8వ సెంటర్‌లో ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో మీనాక్షి అనే గర్భవతికి సీమంతం కార్యక్రమాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా 55వ డివిజన్ నూతన కార్పొరేటర్ హరిహరన్ యాదవ్ హాజరయ్యారు. సెక్టార్ సూపర్వైజర్ శారద కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు. సూపర్వైజర్ శారద, అంగన్‌వాడీ టీచర్ల ఆధ్వర్యంలో గర్భిణికి పసుపు, కుంకుమ, స్వీట్లు, పూలు, పండ్లు, చీర, గాజులు అందజేసి సాంప్రదాయబద్ధంగా వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్వైజర్ శారద మాట్లాడుతూ గర్భవతులకు పుట్టింటి వద్ద లభించే ఈ ప్రత్యేక గౌరవాన్ని స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి అంగన్‌వాడీ కేంద్రాల్లో సాంప్రదాయబద్ధంగా నిర్వహించడం ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు జక్కుల రాధా, ఆర్పీ మీరాబాయి, ఆశా వర్కర్ గంగా, హెల్పర్ అనసూయ, అలాగే డివిజన్ మహిళలు వాడపల్లి సావిత్రి, శాంతి, ధరణి, దుర్గాదేవి, జంజర్ల లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# విద్యారంగానికి 20% బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేస్తూ విద్యార్థి మహాసభ



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 13 (వార్త సంధ్య) :** కొత్తగూడెం పట్టణంలోని శేషగిరి భవన్‌లో సాదిక్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం వందలాది మంది విద్యార్థులతో విద్యార్థి మహాసభ నిర్వహించారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టబోయే రాష్ట్ర బడ్జెట్‌లో విద్యారంగానికి కనీసం 20 శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ ఈ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ప్రొఫెసర్ హరగోపాల్ మరియు మిసెస్ ఇండియా, ఫిట్ ఇండియా అంబాసడర్ డా. ఎం.ఎ. ఫర్హా హాజరయ్యారు. సభకు సాదిక్ ఫౌండేషన్ చైర్మన్ సాదిక్ అలీ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగానికి కేటాయిస్తున్న బడ్జెట్ సుమారు 8 శాతం మాత్రమే ఉందని, దాన్ని తప్పనిసరిగా 20 శాతానికి పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం విద్యను ప్రాధా న్యంగా తీసుకొని గ్రామీణ పాఠశాలలను బలోపేతం చేయాలని ఆయన సూచించారు. సాదిక్ ఫౌం డేషన్ చైర్మన్ సాదిక్ అలీ మాట్లాడుతూ విద్యా బడ్జెట్ పెంపు కోసం జనగామ, పెద్దపల్లి, ఖమ్మం జిల్లాల కేంద్రా ల్లో కూడా విద్యా గర్జన సభలు నిర్వహించామని, ఇప్పుడు కొత్తగూడెంలో నిర్వహించిన ఈ విద్యా సభతో నైనా ప్రభుత్వం స్పందించి విద్యారంగానికి 20 శాతం బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. మిసెస్ ఇండియా డా. ఎం.ఎ. ఫర్హా మాట్లాడుతూ విద్యకు తగిన నిధులు కేటాయించకుండా ప్రభుత్వం ఎన్ని కార్యక్రమాలు చేపట్టినా అవి ఫలప్రదం కావని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ విద్యార్థి నాయ కుడు అజిత్, జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే సాహిద్, బహుజన ఐక్య వేదిక బాధ్యులు దేవదానం తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన 99 రోజుల ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా

## ఈరోజు ఖైరతాబాద్‌లోని బీసీ కమిషన్ కార్యాలయంలో దస్త్రాల పరిష్కారం పరిసరాల శుభ్రత కార్యక్రమం చేపట్టడం జరిగింది.





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 13 :** ఈ కార్యక్రమంలో బీసీ కమిషన్ చైర్మన్ జి. నిరంజన్, సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, శ్రీమతి బాలలక్ష్మి మరియు సభ్య కార్యదర్శి శ్రీమతి బి. బాల మాయా దేవి, ఐఏఎస్., పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ డైరెక్టర్ యు. శ్రీనివాసరావు, సహాయ కార్యదర్శి కె. మనోహర్ రావు, ప్రత్యేక అధికారి కుమారి ఎన్. సునీత, సెక్షన్ ఆఫీసర్లు జి. సతీష్ కుమార్, ఇర్ఫాన్ ఖాన్, రీసెర్చ్ ఆఫీసర్ జి. లక్ష్మీనారాయణ మరియు ఇతర సిబ్బంది కూడా పాల్గొన్నారు. ఇందులో భాగంగా కమిషన్ చైర్మన్, సభ్యులు, సభ్య కార్యదర్శి అధికారులు, కార్యాలయ ఆవరణం మొత్తం పరిశీలించి పరిసరాల శుభ్రత కొరకు తీసుకోవాల్సిన చర్యలను గుర్తించారు. ఈ పనులను రానున్న వారం రోజుల్లో పూర్తి చేయాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా చైర్మన్ జి. నిరంజన్ మాట్లాడుతూ కార్యాలయ ఆవరణను పరిశుభ్రంగా ఆహ్లాదకరమైన వాతావరణంలో ఉంచుకోవాలని సిబ్బందిని కోరారు. ఈ 99 రోజుల కార్యక్రమంలో భాగంగా పెండింగ్‌లో ఉన్న దస్త్రాలను పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించారు.

# మృతుల కుటుంబాలను పరామర్శించిన మంత్రి శ్రీధర్ బాబు

## పెరుగు సతీష్, బత్తుల సత్యనారాయణ కుటుంబాలని పరమర్శించిన మంత్రి శ్రీధర్ బాబు





**పెద్దపల్లి, మంథని, మార్చి 13 (వార్త సంఖ్య) :** రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాతసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు శుక్రవారం మంథని పట్టణంలోని పోచమ్మ వాడకు చెందిన యూత్ కాంగ్రెస్ నాయకులు పెరుగు సతీష్ ఇటీవల మరణించగా వారి ఇంటికి వెళ్లి చిత్రపటానికి పూలమాలవేసి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపినారు. అలాగే మంథని మున్సిపల్ పరిధిలోని గంగపురికి చెందిన బత్తుల సత్యనారాయణ ఇటీవల మరణించగా వారి చిత్రపటానికి పూలమాలవేసి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగడ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## గ్యాస్ వినియోదారులకు పంపిణీ




**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య ) మార్చి 13 ::** రాష్ట్రంలో ఎల్పిజి నిల్వలు, గ్యాస్ వినియోగదారులకు పంపిణీ, ప్రస్తుత పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శ్రీ కె. రామకృష్ణారావు శుక్రవారం డా.బి.ఆర్.అంబేద్కర్ రాష్ట్ర సచివాలయంలో ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, సివిల్ సప్లై విభాగం అధికారులతో సమీక్ష చేశారు. సమావేశంలో రాష్ట్రవ్యాప్తంగా ఎల్పిజీ గ్యాస్ సరఫరా, నిల్వలు, రవాణా వ్యవస్థ, భవిష్యత్ అవసరాలు వంటి అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా సి.ఎస్ మాట్లాడుతూ రాష్ట్రంలో గృహ వినియోగదారులకు ఎల్పిజీ గ్యాస్ సిలిండర్ల పంపిణీలో ఇబ్బంది లేకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రోజు వారి సమీక్ష, బ్లాక్ మార్కెటింగ్ లేకుండా చర్యలు, డిస్ట్రిబ్యూటరీలు, ఎజెన్సీల దగ్గర పోలీస్ నిఘా ఉండేలా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.29 కోట్ల గృహ వినియోగదారుల కనెక్షన్లు ఉన్నాయిని, ప్రస్తుత డిమాండ్ కు సరిపడా నిల్వలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఆసుపత్రులు, ప్రభుత్వ హాస్టళ్లు కు డిమాండ్ మేరకు ఎల్పిజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నామని అధికారులు పేర్కొన్నారు. గృహ వినియోగదారులకు ఎల్పిజీ సిలిండర్ల సరఫరా విషయంలో ఎలాంటి ఆందోళన చేందాల్సిన అవసరం లేదని ఆయిల్ కంపెనీల ప్రతినిధులు, శాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 810 డిస్ట్రిబ్యూటరీ కేంద్రాలు ఎల్పిజీ గ్యాస్ సిలిండర్ల సరఫరా చేస్తున్నాయని అన్నారు. వినియోగదారులకు సకాలంలో డెలివరీ జరిగేలా ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు చర్యలు తీసుకోవాలని సి.ఎస్ ఆదేశించారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో సమయానికి సరఫరా అందేలా సంబంధిత శాఖలతో సమన్వయం పెంచాలని సూచించారు.దఈ సమావేశంలో మార్కెటింగ్ కంపెనీల ప్రతినిధులు, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర గవర్నర్, శ్రీ శివ ప్రతాప్ శుక్లా పదవ తరగతి పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులకు తన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి13 :** పరీక్షలను ఒత్తిడిగా భావించకుండా, తమ జ్ఞానం మరియు ప్రతిభను చూపించే మంచి అవకాశంగా భావించాలని, విద్యార్థులు ఆత్మవిశ్వాసంతో, సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలన్నారు. పరీక్షల సమయంలో ప్రశాంతంగా ఉండి, సమయాన్ని సక్రమంగా వినియోగించుకొని తమ అత్యుత్తమ ప్రతిభను ప్రదర్శించాలని, ఆత్మ విశ్వాసం విజయానికి ముఖ్యమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థులకు వెన్నుదన్నుగా నిలుస్తున్న తల్లిదండ్రులు మరియు ఉపాధ్యాయులను ఆయన ప్రశంసించారు. పరీక్షలకు హాజరవుతున్న ప్రతి విద్యార్థి మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు.

## మున్సిపల్ సాధారణ సమావేశములో ముఖ్య అతిధిగా పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు




**పెద్దపల్లి, మంథని, మార్చి 13 (వార్త సంధ్య) :** మంథని మున్సిపాలిటీలో నూతనంగా ఎన్నికైన పాలక వర్గ సభ్యుల మొదటి సాధారణ సమావేశమునకు శుక్రవారం రాష్ట్ర ఐటి, పరిశ్రమలు శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ వోడ్నాల శ్రీనివాస్ అధ్యక్షతన,మున్సిపల్ కమిషనర్ ఎన్.మనోహర్ నిర్వహించిన సాధారణ సమావేశములో పాలక వర్గ సభ్యులకు మంథని పట్టణ అభివృద్ధి పనుల గురించి దిశ - నిర్దేశ్యము చేశారు. వార్డుల వారిగా ఒక కమిటీని ఏర్పాటు చేసుకొని వారి సలహాలు సూచనలతో ప్రణాళిక తయారు చేసి వార్డుల యందు సమస్యలను పరిష్కరించుకోవాలని మంథని పట్టణ అభివృద్ధి చేయాలనీ తెలిపారు.ఈ క కార్యక్రమంలో అవసరమగు ముఖ్య అంశాలు పారిశుధ్య, త్రాగునీటి, వీధి దీపాలు, మొక్కలు పెంపకం, చలివేంద్రాలు ఏర్పాటు మొదలగు వివిధ అంశాల మీద చర్చించి ఆమోదించారు .తదుపరి మెప్మా విభాగములో ఎస్ ఏచ్ జి ఎస్ మెంబర్స్ స్వయంగా పనికి రాని వస్తువులతో తాయారు చేసిన సృజనాత్మక వస్తువులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముస్కుల సహేందర్ రెడ్డి, పాలక వర్గ సభ్యులు కుర్ర లింగయ్య, నూకల కమల్, మాచీడి రాజు గౌడ్, స్రవంతి మద్దికట్ల, పోతరవేణి శ్రీలత, మారుపాక నిహారిక, శ్వేముల లక్ష్మి, యేల్లంకి వంశీధర్ మున్సిపల్ మహిళా సిబ్బంది, మెప్మా ఆర్.పి లు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్




**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 13 (వార్త సంధ్య) :** కొత్తగూడెం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిని జిల్లా కలెక్టర్ అంకిత్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలు, వైద్య సిబ్బంది పనితీరు, ఔషధాల లభ్యత, పరిశుభ్రత తదితర అంశాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఆసుపత్రిలోని ఔషధాల నిల్వ గదిని సందర్శించి అక్కడ నిల్వ ఉంచిన మందుల స్టాక్‌ను పరిశీలించారు. మందులపై ఉన్న ఎక్స్‌పైరీ తేదీలను స్వయంగా తనిఖీ చేసి గడువు ముగిసిన మందులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోగులకు ఇవ్వకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అవసరమైన అన్ని రకాల మందులు సమృద్ధిగా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం అవుట్ పేషంట్ విభాగాన్ని సందర్శించిన కలెక్టర్ రిజిస్ట్రేషన్ కౌంటర్ వద్ద ఏర్పాటు చేసిన క్యూ లైన్లను పరిశీలించారు. ప్రతిరోజు ఆసుపత్రికి ఎంతమంది ఓపి రోగులు వస్తున్నారు అనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. రోగులు ఎక్కువసేపు వేచి ఉండకుండా రిజిస్ట్రేషన్ ప్రక్రియను వేగవంతం చేయాలని సూచించారు. ఓపి విభాగంలో క్యూ లైన్లో ఉన్న రోగులతో కలెక్టర్ మాట్లాడి వారికి అందుతున్న వైద్య సేవలు, సౌకర్యాల గురించి అడిగి తెలుసుకున్నారు. వైద్య సేవల విషయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైతే వెంటనే ఆసుపత్రి అధికారుల దృష్టికి తీసుకురావాలని రోగులకు సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగికి సమయానికి వైద్య సేవలు అందేలా వైద్యులు, సిబ్బంది కట్టుబడి పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు. అవసరమైన అన్ని రకాల మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండేలా చూడాలని, ఔషధాల కొరత రాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. అలాగే ఆసుపత్రి పరిసరాల్లో పరిశుభ్రతను కచ్చితంగా పాటిస్తూ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ పరిశీలనలో సూపరింటెంట్ డాక్టర్ రమేష్ ఆర్ సి ఓ డాక్టర్ చైతన్య,వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చీకోడ్ లో నీళ్ల కోసం కష్టపడుతున్న రైతన్నలు





**దుబ్బాక ప్రతినిధి మార్చి 13(వార్త సంధ్య ) సిద్దిపేట జిల్లా :** దుబ్బాక మండలం చీకోడ్ గ్రామంలో రైతన్నలు నీళ్ల కోసం తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. పంటలకు అవసరమైన నీరు అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయి. బోర్లు మరియు చెరువుల్లో నీటి మట్టం పడిపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. గ్రామంలోని రైతులు చెబుతున్న ప్రకారం, పంటలు సాగు చేసినప్పటికీ సరైన సమయంలో నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని వాపోతున్నారు. ముఖ్యంగా వరి మరియు ఇతర పంటలకు నీరు లేకపోవడం వల్ల నష్టాలు వస్తున్నాయని తెలిపారు. రైతులు ప్రభుత్వ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి నీటి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. సాగునీరు అందించే విధంగా చెరువులు, కాల్వలు మరియు బోర్ల పరిస్థితిని పరిశీలించి తక్షణమే పరిష్కారం చూపాలని గ్రామ రైతన్నలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# దేశంపై యుద్ధ ప్రమాదం

**పెరుగుతున్న ధరలు ఇబ్బందుల్లో ప్రజలు**

**సిపిఐ ప్రతినిధులుగా త్యాగచరితను కొనసాగించండి**

**సిపిఐ శిక్షణా తరగతుల్లో డా.కె.నారాయణ**



**భద్రాద్రి జిల్లా బ్యూరో, మార్చి 13 (వార్త సంధ్య) :** భారత దేశంపై యుద్ధ ప్రమాదం వడిందని, గ్యాస్ సహా, నిత్యవసరాల ధరలు పెరిగిపోతున్నాయని, వ్యవసాయ ఉత్పత్తుల ఎగుమతులు నిలిచిపోతున్నాయని సిపిఐ జాతీయ క్రమ శిక్షణా సంఘం అధ్యక్షులు డా.కే నారాయణ తెలిపారు. సంపదపై కన్నేసి మోడి సాగిస్తున్న దాడులు సామాన్య ప్రజలకు ఇబ్బంది కరంగా మారాయని ఆయన తెలిపారు. సిపిఐ శిక్షణా తరగతుల్లో భాగంగా పాల్వంచలోని సుగుణ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న సిపిఐ ప్రజాప్రతినిధుల శిక్షణా తరగతుల్లో ప్రస్తుత రాజకీయ సామాజిక పరిస్థితులు- ప్రజా ప్రతినిధులు అనే అంశాన్ని ఆయన బోధించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ప్రస్తుత ఎన్నికల విధానంలో వచ్చిన మార్పులు వ్యయాన్ని దృష్టిలో పెట్టుకుంటే ప్రజాప్రతినిధులుగా గెలుపొందడం గొప్ప విషయమని, సామాన్యన్ని సైతం గౌరవ ప్రజాప్రతినిధులుగా నిలిపిన చరిత్ర కమ్యూనిస్టు పార్టీకే దక్కుతుందన్నారు. కమ్యూనిస్టు పార్టీ ప్రజా ప్రతినిధులుగా ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు భాగాన నిలుస్తూ త్యాగల చరితను కొనసాగించాలని నారాయణ సూచించారు. ప్రజాప్రతినిధులకే అర్థం మారిపోతున్న ఈ రోజుల్లో ప్రజల పక్షాన నిలబడి సిపిఐ ప్రజాప్రతినిదులు నమస్యల పరిష్కారానికి ముందు వరుసలో నిలబడాలన్నారు. మీ పనితీరు కారణంగా పార్టీ మరింత విస్తరించే విధంగా ఉండాలని, నిధులు, విధుల విషయంలో క్రమశిక్షణా యుతంగా వ్యవహరించాలని నారాయణ సూచించారు. ప్రస్తుతం ప్రపంచాన్ని జయించాలనే విధంగా మోడి వ్యవహరిస్తున్నారని, పరాయి దేశాల పాలనలో తలదూర్చడమే కాక తాము నిర్ణయించిన వారే పాలకులుగా ఉండాలని మోడి అజ్ఞాపిస్తున్నాడని ఆయన తెలిపారు. వెనుజుల దేశాధ్యక్షుడు, ఆయన భార్యను బందీ చేశాడని తెలిపారు. అలీన దేశంగా ప్రపంచంలో అతిపెద్ద దేశమైన భారత దేశంలో మోడి కారణంగా ఆబాసుపాలవుతోందని అన్నారు. దేశ ప్రధానిగా మోడి అమెరికా అధ్యక్షుడు ట్రంపు ముందు సాగిలపడుతున్నారన్నారు. విదేశీ విధానం విమర్శల పాలవుతుండగా, దేశంలో పాలన మరింతగా ప్రజలను పీడించే విధంగా ఉందన్నారు. కార్పోరేట్లకు కొమ్ముకాస్తూ ప్రజలపై భారాలను మోపుతున్నారని నారాయణ ఆరోపించారు. అదానీ లాంటి కార్పోరేట్ శక్తులకు మోడి సర్కార్ ఊడిగం చేస్తోందన్నారు. పేదప్రజల సమస్యలను విస్మరిస్తే తగు ఫలితం అనుభవించక తప్పదని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో పేదలు నివశిస్తున్న స్థలాలను క్రమబద్దీకరించి ఇందిరమ్మ ఇల్లు మంజూరీ చేయాలని నారాయణ డిమాండ్ చేశారు. ఈ శిక్షణా తరగతుల్లో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక ఎంఎల్ఎ కూనంనేని సాంబశివరావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు భాగం హేమంతరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్కె సాబీర్ పాషా, ముత్యాల విశ్వనాధం, కల్లూరి వెంకటేశ్వర్లు, కర్రె బిక్షపతి, మేయర్ మూడ్ గణేష్, రాష్ట్ర నలు మూలల నుండి సిపిఐ ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఉపసర్పంచ్లు తదితరులు పాల్గొన్నారు.

## ఆవిష్కరణలు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్‌గా హైదరాబాద్: మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి 13 :** ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో ఆవిష్కరణల కేంద్రంగా హైదరాబాద్ ను తీర్చిదిద్దామని రాష్ట్ర ఐటి, పరిశ్రమల మరియు వాణిజ్య శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాలతో పాటు ఫార్మా, డిఫెన్స్, ఏవియేషన్ పరిశ్రమలకు కూడా నగరం కీలక వేదికగా నిలుస్తోందని ఆయన పేర్కొన్నారు. ఆవిష్కరణలకు, పెట్టుబడులకు గ్లోబల్ హబ్ గా ఎదుగుతోందని చెప్పారు. బ్రిక్స్ దేశాల్లో పారిశ్రామికాభివృద్ధి, పెట్టుబడులకు అనువైన వాతావరణం, ఆధునిక సాంకేతికతల ప్రభావంపై అధ్యయనం చేయడానికి విచ్చేసిన జర్మన్ ప్రతినిధి బృందం సచివాలయంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసింది. 'గ్లోబల్ బ్రిడ్జెస్' అనే అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఈ బృందంలో సభ్యులుగా ఉన్నారు. తెలంగాణలో ఉన్న పారిశ్రామిక అవకాశాలు, అంతర్జాతీయ పెట్టుబడిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలపై మంత్రి వారితో చర్చించారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా సవాళ్లను ఎదుర్కొనేందుకు వినూత్న విధానాలను అమలు చేయడంలో తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే ముందంజలో ఉందని ఈ సందర్భంగా శ్రీధర్ బాబు తెలిపారు. పరిశ్రమలకు నిరంతర విద్యుత్ సరఫరా, నీటి లభ్యతలో ఎలాంటి అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నామని చెప్పారు. ప్రభుత్వాల మార్పుతో సంబంధం లేకుండా మెరుగైన పారిశ్రామిక విధానాలను కొనసాగిస్తూ పరిశ్రమలకు స్థిరత్వాన్ని కల్పిస్తున్నామని వివరించారు. భౌగోళికంగా భారతదేశం నడిబొడ్డున ఉన్న హైదరాబాద్ ఏడాది పొడవునా ఆహ్లాదకర వాతావరణం, విభిన్న సంస్కృతుల సమ్మేళనంతో కూడిన కాస్మోపాలిటన్ జీవనశైలితో ప్రపంచం నలుమూలల నుంచి వచ్చే వారికి 'సొంత ఊరు' అనే భావన కలిగిస్తోందని మంత్రి పేర్కొన్నారు. నగరం దక్షిణ భాగంలో ప్రతిష్ఠాత్మక 'ఫ్యూచర్ సిటీ' ప్రాజెక్టు వేగంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. ఇందులో భాగంగా ఏర్పాటవుతున్న ఏఐ సిటీ, నెట్ జీరో సిటీ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ వంటి ప్రాజెక్టులు రాష్ట్ర భవిష్యత్తుకు బలమైన పునాది వేస్తాయని అన్నారు. తెలంగాణలో అపారమైన మానవ వనరులు, టాలెంట్ పూల్ అందుబాటులో ఉండటంతో పరిశ్రమలకు నిపుణుల కొరత తలెత్తే సమస్యే ఉండదని స్పష్టం చేశారు. ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న వృత్తి నిపుణులతో పాటు కొత్తగా ఇంజనీరింగ్ పూర్తి చేసిన యువతను ప్రపంచ స్థాయి సవాళ్లకు సిద్ధం చేయడానికి ప్రభుత్వం స్కిల్లింగ్, రీ-స్కిల్లింగ్ కార్యక్రమాల ద్వారా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిస్తున్నట్టు చెప్పారు. సెమీ కండక్టర్ రంగం తెలంగాణలో వేగంగా విస్తరిస్తోందని, చిప్స్ డిజైన్, తయారీ రంగాల్లో తైవాన్, కొరియా సంస్థలు ఇప్పటికే కార్యకలాపాలు ప్రారంభించాయని వివరించారు. డేటా సెంటర్ల ఏర్పాటుకు దిగ్గజ కంపెనీలు ముందుకొస్తున్నాయని తెలిపారు. జర్మనీ సాంకేతికత తోడైతే ఇంజనీరింగ్ రంగంలో తెలంగాణ మరింత ముందుకు దూసుకెళ్తుందని శ్రీధర్ బాబు విశ్వాసం వ్యక్తం చేశారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలు పూర్తయ్యే 2047 నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో జర్మన్ ప్రతినిధి బృందం సభ్యులు డా. స్టెఫాన్ ట్రేగర్, డా. క్రిస్టియన్ అల్టెన్ హోఫెన్, ఫ్రాంక్ బీర్ హోస్ట్, అలెగ్జాండర్ వాన్ క్రామ్, మాల్టె హొహ్ ఫీల్డ్, ఫిలిప్ మేయర్ హోఫర్, మ్యాక్స్ మిల్లన్ వ్యాన్ లెయర్ తదిరులు పాల్గొన్నారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి కూడా హాజరయ్యారు.

# గందరగోళం వద్దూ... కావలసినంత ఉంది

**గ్యాస్ సరఫరాపై అపోహలు పడకండి**

**ఎలాంటి భయాందోళనకు గురి కావొద్దు**

**బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కోరత లేదు**

**అపోహలను అడ్డు పెట్టుకుని బ్లాక్ చేస్తే ఉపేక్షించేది లేదు**

**చర్యలు కఠినంగా ఉంటాయి**

**జిల్లాలో సమన్వయ కమిటీలతో తక్షణం సమావేశం ఏర్పాటు చెయండి**

**గ్యాస్ కొరత అంటూ జరుగుతున్న ప్రచారాన్ని సమర్థవంతంగా తిప్పి కొట్టాలి**

**సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారంతోటే ఈ దుస్థితి**

**గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులకు,విద్యాసంస్థలతో పాటు ప్రభుత్వ సంస్థలకు,ఆశ్రమాలకు ప్రాధాన్యత**

**ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ**

**-కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్ల వీడియో కాన్ఫరెన్స్ లో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టికరణ**



**హైదరాబాద్ సిటీ ప్రతినిధి (వార్త సంధ్య) మార్చి 13 :** అమెరికా-ఇరాన్ కు జరుగుతున్న యుద్ధం నేపథ్యంలో రాష్ట్రంలో గ్యాస్ కొరత ఏర్పడినట్లు జరుగుతున్న ప్రచారంలో ఎటువంటి వాస్తవం లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ప్రజల్లో లేని పోనీ అపోహలు సృష్టించి వారిని గందరగోళంలో పడేసేలా జరుగుతున్న ప్రచారంపై అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని ఆయన అధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో ఎల్.పి.జి గ్యాస్ సరఫరాపై వినియోగదారులు గందరగోళం చెందుతున్న దృష్టా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి శుక్రవారం ఉదయం డాక్టర్ బి.ఆర్.అంబెడ్కర్ సచివాలయంలో సహచర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు,పౌర సరఫరాల శాఖా కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర లతో కలిసి జిల్లాల కలెక్టర్లు,ఎస్.పి లు,పోలీస్ కమిషనర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో హైలెవల్ కమిటీ ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్.పి.జి గ్యాస్ సరఫరా విషయంలో ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని,గృహ వినియోగ దారులకు సరిపడా సరఫరా చేస్తామని భరోసా ఇచ్చారు. సోషల్ మీడియా వేదిక ద్వారా జరుగుతున్న తప్పుడు ప్రచారంతోటే కృత్రిమంగా గ్యాస్ కొరత సృష్టించేందుకు జరుగుతున్న ప్రచారాన్ని ఆయన



తీవ్రస్థాయిలో తిప్పి కొట్టారు. ఇటువంటి గందరగోళం ఏర్పడినందునే రోజు వారిగా 72 శాతం బుకింగ్స్ జరుగుతున్నాయని అయితే గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రిలకు, విద్యాసంస్థలకు,వృద్ధాశ్రమలకు,ప్రభుత్వ సంస్థలకు ప్రాధన్యత క్రమంలో సరఫరా చేసేందుకు ప్రభుత్వం సన్నద్ధంగా ఉందని ఆయన తెలిపారు.రాష్ట్రంలో 810 ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్ల ద్వారా గ్యాస్ సరఫరా జరుగుతుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా కోటి 29 లక్షల ఎల్.పి.జి కనెక్షన్లు ఉండగా రోజు వారిగా 2.5 లక్షల సిలిండర్ల సరఫరా జరుగుతుందని ఆయన వివరించారు. ఇప్పటి వరకు రాష్ట్రంలోనీ బాట్లింగ్ ప్లాంట్లలో గ్యాస్ కొరత ఉన్నట్లు ఎక్కడా నమోదు కాలేదని ఆయన చెప్పారు. అపోహలను అడ్డుపెట్టుకుని బ్లాక్ చేయాలని చూస్తే ప్రభుత్వం ఎంత మాత్రం ఉపేక్షించదని, కఠినమైన చర్యలకు ఉపక్రమిస్తుందని ఆయన హెచ్చరించారు. తాజగా జరుగుతున్న ప్రచారాన్ని అడ్డుపెట్టుకొని అక్రమంగా గ్యాస్ నిలువ చేయడం,అక్రమంగా మళ్లించడం ,బ్లాక్ మార్కెటింగ్ కు పాల్పడడం వంటి చర్యలకు పాల్పడనందుకు గాను ఇప్పటి వరకు 288 కేసులు నమోదు చేశామన్నారు.ఎల్.పి.జి డిస్ట్రిబ్యూటర్లు ఇదే విదంగా ప్రవర్తిస్తే మరిన్నీ కఠిన చర్యలకు ఉపక్రమించాలని ఆయా జిల్లాల కలెక్టర్లకు,ఎస్.పి లు,పోలీస్ కమీషనర్లకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశించారు. అదే సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా కమాండ్ కంట్రోల్ సెంటర్ ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు. ఆయా జిల్లాల్లో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక అధికారుల కమిటీ ఏర్పాటు చేసి రోజువారీ నిల్వలు,సరఫరా పరిస్థితిని సమీక్షించాలని ఆయన సూచించారు. పట్టణ ప్రాంతాల్లో 25 రోజుల కొకసారి ,గ్రామీణ 45 రోజులకు ఒకమారు ఎల్.పి.జి బుక్ చేసుకోవాలని ఆయన గ్యాస్ వినియోగదారులకు సూచించారు. అదే సమయంలో అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవొద్దని,గృహా వినియోగ దారులకు సరిపడా గ్యాస సరఫరా చేస్తామని,ప్రభుత్వం దగ్గర ఉండి ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తుందని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



RNI TGTEL/25/A5065
vaartha sandhya
వార్త సంధ్య
తెలుగు దిన పత్రిక



## రామవరం లో ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం అవగాహన సదస్సు



**కొత్తగూడెం కార్పొరేషన్, మార్చి 13 (వార్త సంధ్య) :** కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రధానమంత్రి విశ్వకర్మ పథకంపై అవగాహన కల్పించేందుకు ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో శుక్రవారం నాడు రామవరం 17వ డివిజన్ లోని సింగరేణి కమ్యూనిటీ హాల్ లో లబ్ధిదారుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు. గతంలో సింగరేణి సేవా సమితిలో శిక్షణ పొందిన మహిళలు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ వివిధ స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ మోరె రూప మాట్లాడుతూ, రామవరం ప్రాంత మహిళల చైతన్యం మరియు ఉపాధి అవకాశాల కోసం ఎన్నో సంవత్సరాలుగా శిక్షణ కార్యక్రమాలను ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న ఈ శిక్షణా కార్యక్రమం సింగరేణి కమ్యూనిటీ హాల్ లో మూడు రోజుల పాటు కొనసాగుతుందని, పాల్గొనే వారికి మధ్యాహ్న భోజన సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. శిక్షణ పొందిన మహిళలు తమ చేతివృత్తుల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకుని స్వయం ఉపాధి సాధించేందుకు ఇది మంచి అవకాశం అని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి లక్ష రూపాయల నుండి కోటి రూపాయల వరకు రుణం పొందే అవకాశం ఉందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ఎంఎస్ఎంఈ డెవలప్మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో రామవరం ప్రాంతంలో ఈ కార్యక్రమం నిర్వహించడం సంతోషకరమని, మహిళలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఉపాధి పొందాలని పిలుపునిచ్చారు.

## దుబ్బాకలో అంగన్వాడీ చిన్నారుల ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే / బాల మేళా ఘనంగా నిర్వహణ









**దుబ్బాక ప్రతినిధి మార్చి 13(వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని అంగన్వాడీ కేంద్రాలు మరియు పూర్వ ప్రాథమిక పాఠశాలల చిన్నారుల కోసం నిర్వహించిన ప్రీస్కూల్ గ్రాడ్యుయేషన్ డే / బాల మేళా (పిల్లల పండుగ) కార్యక్రమం శుక్రవారం దుబ్బాకలోని వైశ్య భవన్‌లో ఘనంగా నిర్వహించబడింది. కార్యక్రమానికి విచ్చేసిన అతిథులను అంగన్వాడీ చిన్నారులు పుష్పగుచ్ఛాలతో స్వాగతించి వేదికపైకి ఆహ్వానించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన కార్యక్రమం నిర్వహించగా, చిన్నారులు ఆలపించిన ప్రార్థన గీతం మరియు స్వాగత గీతం సభకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. ఈ సందర్భంగా చిన్నారులు డాన్స్‌లు, పాటలు, చిన్న నాటికలు, సృజనాత్మక కార్యక్రమాలు (పెయింటింగ్, బొమ్మలు) ప్రదర్శించి తమ ప్రతిభను ఆవిష్కరించారు. తల్లిదండ్రుల సమక్షంలో జరిగిన ఈ కార్యక్రమంలో పిల్లల ప్రతిభకు అతిథులు మరియు తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా అంగన్వాడీ కేంద్రాల్లో జరుగుతున్న పోషణ, ఆరోగ్యం మరియు ప్రాథమిక విద్యకు సంబంధించిన కార్యక్రమాలు, అలాగే చిన్నారుల లెర్నింగ్ యాక్టివిటీస్ ప్రదర్శిం చబడ్డాయి. బాల మేళాలో పిల్లలు తయారు చేసిన విద్యా మోడల్స్, అవగాహన స్టాల్స్ సందర్శకులను ఆకట్టు కున్నాయి.





అనంతరం గ్రాడ్యుయేషన్ సెరిమనీ నిర్వహించి చిన్నారులకు ప్రీస్కూల్ అసెస్మెంట్ కార్డులు మరియు గుర్తింపులను అతిథుల చేతుల మీదుగా అందజేశారు. తల్లిదండ్రులు అంగన్వాడీ సిబ్బంది చేస్తున్న సేవలను ప్రశంసించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్మన్ శ్రీరామ్ సంగీత రవీందర్, వైస్ చైర్మన్ ఆశ సులోచన స్వామి, సాయి రిలయన్స్ స్టేట్ కోఆర్డినేటర్, ఐసిడిఎస్ సిడిపిఓ ఎల్లయ్య, పోషణ అభియాన్ కోఆర్డినేటర్ వెంకట ప్రసాద్, రిలయన్స్ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్ హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రమ్య రాజేష్, బండి శ్రీలేఖ రాజు, తునికి సురేష్, అనంతల భాగ్యమ్మ శ్రీనివాస్, దేవుని రాజు, మహమ్మద్ చాంద్ మియా, శ్రీరామ్ సరస్వతి నరేందర్, ఐరేని అఖిల సాయి తేజ, సర్పంచ్ సల్కం మల్లేశం యాదవ్, రిలయన్స్ కోఆర్డినేటర్లు భాస్కర్, సరిత, స్వప్న, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్లు శ్యామ్సన్, సురేష్, జనార్ధన్, సుధారాణి, ఐసిడిఎస్ సూపర్వైజర్లు చంద్రకళ, అంతుల్, శ్రీలేఖ, ప్రతిభ, రేణుక, రాజేశ్వరి, గిరిజ, స్వరూప, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, చిన్నారులు మరియు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. చిన్నారుల మానసిక, శారీరక, సామాజిక వికాసానికి అనుగుణంగా రూపొందించిన కార్యక్రమాలు, తల్లిదండ్రుల భాగస్వామ్యంతో అంగన్వాడీలపై విశ్వాసం పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషించాయని నిర్వాహకులు తెలిపారు. చివరిగా ఐసిడిఎస్ సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్న అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

## వలస గుత్తికోయ గ్రామాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుంది : జిల్లా ఎస్పీ రోహిత్ రాజు





**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మార్చి 13 (వార్త సంధ్య) :** కరకగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని మారుమూల వలస గుత్తికోయ గ్రామాలైన నీలాద్రిపేటగండి, అశ్వాపురంపాడు గ్రామాల్లో ప్రజలకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అలాగే గ్రామాల్లో సోలార్ వీధి దీపాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా హాజరై నీలాద్రిపేటగండి గ్రామంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ వైద్య శిబిరానికి సుమారు 70 కుటుంబాలకు చెందిన 300 మంది ఆదివాసీ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వలస గుత్తికోయ గ్రామాలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. వలస ఆదివాసీ ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నామని చెప్పారు. విద్య, వైద్యం, రవాణా వంటి మౌలిక సౌకర్యాలను కల్పించేందుకు అన్ని శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేసే పోలీస్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి అర్హుడికి అందేలా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. అలాగే గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని గ్రామస్తులను కోరారు. అనంతరం కార్యక్రమంలో భాగంగా మహిళలకు చీరలు, నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. యువతకు టీ–షర్టు, వాలీబాల్ కిట్లు అందజేశారు. స్కూల్ విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, నోటుబుక్స్, సోలార్ స్టడీ ల్యాంప్స్ పంపిణీ చేశారు. వైద్య శిబిరంలో గ్రామస్తులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందిం చారు. గ్రామాల్లో సేవలందించిన వైద్య బృందానికి ఎస్పీ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. తమ గ్రామంలో సోలార్ వీధి దీపాలు ఏర్పాటు చేసినందుకు గ్రామ ప్రజలు హర్షం వ్యక్తం చేసి పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్స్) నరేందర్, మణుగూరు డీఎస్పీ రవీందర్ రెడ్డి, ఏడూళ్ల బయ్యారం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సైలు సురేష్, పి.వి.ఎన్ రావు తదితరులు పాల్గొన్నారు.

## గ్యాస్ సరఫరాపై గందరగోళం వద్దు

**గ్యాస్ సిలిండర్ల సరఫరా, రబీ పంటలకు సాగునీటి అందుబాటు, వరి ధాన్యం కొనుగోలు అంశాలపై శుక్రవారం జిల్లా కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్ సమావేశం**

**జిల్లా కలెక్టర్లు అధికారులకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం**





**హైదరాబాద్, వార్త సంధ్య :** గ్యాస్ సిలిండర్ల సరఫరా, రబీ పంటలకు సాగునీటి అందుబాటు, వరి ధాన్యం కొనుగోలు అంశాలపై శుక్రవారం హైదరాబాదు నుంచి ఇరిగేషన్ శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సంబంధిత ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఎల్పీజీ గ్యాస్ సరఫరా విషయంలో ప్రజలు ఎటువంటి గందరగోళానికి గురి కావొద్దని సూచించారు. గృహ వినియోగదారులకు సరిపడా గ్యాస్ సరఫరా అందిస్తామని భరోసా ఇచ్చారు. గృహ వినియోగదారులతో పాటు ఆసుపత్రులు, విద్యాసంస్థలు, వృద్ధాశ్రమాలు, ప్రభుత్వ సంస్థలకు ప్రాధాన్యత క్రమంలో గ్యాస్ సరఫరా చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అపోహలను నమ్మి అవసరానికి మించి సిలిండర్లు బుక్ చేసుకోవద్దని ఆయన రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ సరఫరా సజావుగా కొనసాగించేలా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలు ఎండిపోకుండా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పంటల కోత పూర్తయ్యే వరకు క్షేత్రస్థాయిలో అధికారులు పర్యటిస్తూ సాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని చెప్పారు. జిల్లాల కలెక్టర్లు నీటిపారుదల, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు పూర్తి సహకారం అందించాలని సూచించారు. వరి ధాన్యం కొనుగోలు విషయంలో తగు చర్యలు తీసుకుని నిల్వ కేంద్రాలను గుర్తించాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అలాగే ఆయిల్ పామ్ మరియు ఉద్యాన పంటలను రైతులు సాగు చేయడానికి ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మాట్లాడుతూ గ్యాస్ సిలిండర్ల కొరతపై కొన్ని మీడియా మరియు సామాజిక మాధ్యమాల్లో వస్తున్న వార్తల వల్ల ప్రజలు అపోహలకు గురికాకుండా అధికారులు గ్యాస్ ఏజెన్సీలపై పర్యవేక్షణ చేయాలని సూచించారు. కొంతమంది వినియోగదారులు ముందుగానే గ్యాస్ బుక్ చేసుకుంటున్న నేపథ్యంలో బుకింగ్ పీరియడ్‌ను 15 రోజుల నుంచి 25 రోజులకు పెంచినట్లు తెలిపారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని నిర్ణయించిన షెడ్యూల్ ప్రకారం 99 రోజులపాటు నిర్విఘ్నంగా కొనసాగించాలని సీఎస్ ఆదేశించారు. ఏప్రిల్ రెండవ తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించి ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా అవగాహన కల్పించాలని చెప్పారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి మరియు సంబంధిత శాఖల అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడిన కలెక్టర్ జిల్లాలోని గ్యాస్ ఏజెన్సీలు గృహ వినియోగదారులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సిలిండర్ల సరఫరా చేయాలని సూచించారు. పౌర సరఫరాల శాఖ అధికారులు దీనిపై నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి వనజాత, మేనేజర్ హరీష్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉష, ఉద్యానవన శాఖ అధికారి సురేష్, మార్కెటింగ్ శాఖ అధికారి రియాజొద్దీన్, ఇరిగేషన్ అధికారులు, మార్క్‌ఫెడ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి జిల్లాలో ముదిరాజ్ భవనాల స్థల కేటాయింపులకై ఈ బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలి...

**మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్ & రాష్ట్ర కమిటీ**





**హైదరాబాద్ సిటీ ప్రతినిధి ( వార్త సంధ్య) మార్చి13 :** ప్రతి జిల్లాలో ముదిరాజ్ లకు స్థలం కేటాయించి భవనాలు నిర్మించాలని మెపా ( ముదిరాజ్ ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ తెలంగాణ) వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు పులి దేవేందర్ ముదిరాజ్, రాష్ట్ర కమిటీతో పాటు మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ ముదిరాజ్ మత్స్య పశుసంవర్ధక క్రీడా శాఖ మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ను హైదరాబాదులోని మినిస్టర్స్ క్వార్టర్స్ లో కలసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మెపా వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు పులి దేవేందర్ ముదిరాజ్ మాట్లాడుతూ... ప్రతి జిల్లాలో ముదిరాజ్ భవనాలు ఏర్పాటు చేసినట్లయితే .. చదువుకున్న విద్యార్థులకు ఉపయోగకరంగా ఉంటుందని,అలాగే ముదిరాజు విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధి శిక్షణ కొరకు కూడా ఉపయోగించవచ్చు అని అన్నారు.ఎంత చదువు ఉన్నా సరైన శిక్షణ సలహాలు లేకుంటే చదివిన చదువులు నిరర్థకం అన్నారు. అందుకే మంత్రి వాకిటి శ్రీహరి ముదిరాజ్ ఈ విషయంపై ముఖ్యమంత్రి తో మాట్లాడి,బడ్జెట్ సమావేశాల్లో చర్చించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెపా మహాభాయబాబ్ జిల్లా అధ్యక్షులు దుండి అశోక్ ముదిరాజ్,చెన్న రాములు ముదిరాజ్, బలరాం ముదిరాజ్,పుట్టి రాజు ముదిరాజ్, శ్రీనివాస్,రాజు,రమేష్ లు పాల్గొన్నారు.

## 19 గ్యాస్ సిలిండర్లు సీజ్, 7 హోటల్స్ పై కేసులు నమోదు....

**అదనపు కలెక్టర్ డి.వేణు**









**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి13 (వార్త సంధ్య) :** గోదావరిఖని ప్రాంతంలో నిర్వహించిన తనిఖీల్లో 19 గ్యాస్ సిలిండర్లు సీజ్ చేసి, 7 హోటల్స్ పై కేసులను నమోదు చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ డి.వేణు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరసరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు శుక్రవారం గోదావరిఖని ప్రాంతంలోని వివిధ హోటల్స్ లో తనిఖీలు నిర్వహించడం జరిగిందని , గృహ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 7 హోటల్స్ పై కేసులు నమోదు చేసి 19 సిలిండర్లు సీజ్ చేయడం జరిగిందని అదనపు కలెక్టర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు

## శ్రీశ్రీశ్రీ ఆత్మకూరి మొల్లమాంబ 586 జయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని కుమ్మరి కులానికి చెందిన సభ్యులందరికీ జయంతి శుభాకాంక్షలు..

**తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం పెద్దపల్లి జిల్లా యువత అధ్యక్షులు టీ కే రాజేష్**





**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి, మార్చి13 (వార్త సంధ్య) :** శ్రీశ్రీశ్రీ ఆత్మకూరు మల్లమాంబ 586 వ జయంతి సందర్భంగా రెండు తెలుగు రాష్ట్రాల్లోని కుమ్మరులందరికీ శుభాకాంక్షలు తెలిపిన పెద్దపల్లి జిల్లా కుమ్మరి యువత అధ్యక్షుడు టీకే రాకేష్. టీ కే రాజేష్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు పరిపాలించిన కాలంలో కుమ్మరి కులంలో జన్మించిన కవయిత్రి మొల్లమాంబ రామాయణాన్ని సంస్కృతం నుంచి తెలుగులోకి ఐదు రోజుల్లోనే అనువదించిన చరిత్ర కుమ్మర్ల ముద్దు బిడ్డ అయిన మొల్లమాంబది అన్నారు.తెలంగాణ ప్రభుత్వం మొల్లమాంబా జయంతి ఉత్సవాలను రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని కుమ్మరి కులం తరపున డిమాండ్ చేస్తా ఉన్నాం. అలాగే తెలంగాణ రాష్ట్రంలో ఉన్న ప్రతి జిల్లాలో మరియు నియోజకవర్గంలో, మండలాల్లో, కార్పొరేషన్ మున్సిపాలిటీలలో మొల్లమాంబా విగ్రహాల ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం అని, బిసి సామాజిక వర్గంలో ఒకటైనటువంటి కుమ్మరి కులం కులవృత్తి పరంగా చాలా వెనుకబడి ఉందని, రాష్ట్రవ్యాప్తంగా, కులవృత్తి జీవనోపాధిగా, చేసుకొని జీవనం పొందుతున్న కులవృత్తి తయారీ యొక్క యంత్రంగాలకు తక్షణమే కార్పొరేషన్ ద్వారా వంద కోట్ల ఫండ్ రిలీజ్ చేసి కుల వృత్తిని కాపాడాలని ప్రభుత్వాన్ని కోరినారు.

## సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు పిలుపు.

**కార్యాచరణ వాల్ పోస్టర్ ను విడుదల చేసిన గుర్తింపు సంఘం ఎఐటియుసి నాయకులు**



**కొత్తగూడెం/సింగరేణి, మార్చి 13 (వార్త సంధ్య) :** సింగరేణి లో కార్మికుల సమస్యలను పరిష్కరించడం లో యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందినందున గుర్తింపు సంఘం ఏఐటియుసి ఆందోళన కార్యక్రమాలకు పిలుపు నిచ్చిందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఎఐటియుసి కేంద్ర కార్యదర్శి వంగ వెంకట్, బ్రాంచ్ కార్యదర్శి రమణమూర్తి పేర్కొన్నారు. శనివారం కొత్తగూడెం శేషగిరిభవన్ లో జరిగిన వాల్ పోస్టర్ విడుదల కార్యక్రమం లో వారు పాల్గొని ప్రసంగించారు. సింగరేణి లో గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి రెండు సంవత్సరాలు గడిచినా యాజమాన్యం కొన్ని సమస్యల ను స్ట్రక్చర్ కమిటీ సమావేశాల్లో అంగీకరించి ఇంత వరకు వాటిపై అమలు కోసం యాజమాన్యం సర్క్యులర్ లు జారీ చేయలేదని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా మారుపేర్ల విజిలెన్స్ కేసుల సమస్య, సొంత ఇంటి పథకం, పెర్క్స్ పై ఇన్ కం టాక్స్ సమస్య, డిస్మిస్ కార్మికుల కు ఒక అవకాశం కల్పించాలని కోరడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. సమస్యలను పరిష్కరించకుండా నిర్లక్ష్యం చేస్తుందని కనుక భవిష్యత్తు కార్యాచరణ వాల్ పోస్టర్ను విడుదల చేసింది, ఏఐటియుసి ఈ నెల 17 నుండి 30 వరకు సింగరేణి వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలను మరియు ఏప్రిల్ లో జరగబోయే సమ్మె విజయవంతం చెయ్యాలని పిలుపు నివ్వడం జరిగిందని, కావున జరగబోయే ఆందోళన కార్యక్రమంలో కార్మికులు అధికసంఖ్యలో పాల్గొని సింగరేణి మనుగడను కాపాడాలని కోరారు, ఈ కార్యక్రమంలో కేంద్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి వీరస్వామి, ఆఫీస్ బ్యారర్స్ సందబోయిన శ్రీనివాస్, ఎస్ నాగేశ్వరరావు, ఎఐటియుసి నాయకులు మాతంగి లింగయ్య,లక్ష్మీనారాయణ,బండారి మల్లయ్య,మండల రాజేశ్వరరావు,నరేష్,నితిన్, సోమయ్య, తాతిదారులు పాల్గొన్నారు.

## గ్యాస్ కొరతపై వదంతులను నమ్మొద్దు

**: కలెక్టర్ నారాయణ రెడ్డి**





**రంగారెడ్డి జిల్లా బ్యూరో, వార్త సంధ్య :** రాష్ట్రంలో ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడిందన్న ప్రచారంలో ఎలాంటి వాస్తవం లేదని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి స్పష్టం చేశారు. జిల్లాలో గ్యాస్ సరఫరా సాధారణంగానే కొనసాగుతోందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు.అమెరికాఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో రాష్ట్రంలో చమురు, ఎల్పీజీ గ్యాస్ కొరత ఏర్పడుతుందన్న వార్తలు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్నాయని పేర్కొన్నారు. అయితే అలాంటి ప్రచారాలకు ఎలాంటి ఆధారాలు లేవని తెలిపారు.ఇప్పటివరకు గ్యాస్ బుకింగ్ చేసిన తర్వాత ఎలా సరఫరా జరుగుతుందో ప్రస్తుతం కూడా అదే విధంగా కొనసాగుతుందని, సరఫరాలో ఎలాంటి జాప్యం ఉండదని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో సరిపడా ఎల్పీజీ గ్యాస్ నిల్వలు ఉన్నాయని ఆయన వెల్లడించారు. గృహ వినియోగానికి మాత్రమే కాకుండా ఆసుపత్రులు, విద్యాసంస్థల వసతి గృహాలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కూడా గ్యాస్ సరఫరాలో ఎలాంటి సమస్య లేదని చెప్పారు. గ్యాస్ కొరతపై వస్తున్న అవాస్తవాలు, వదంతులను నమ్మి ప్రజలు అనవసరంగా ఆందోళన చెందవద్దని జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో కోరారు.

## డీసీఎం వాహనం ఢీకొట్టి విద్యుత్ స్తంభం విరిగింది కౌన్సిలర్ చొరవతో వెంటనే కొత్త స్తంభం ఏర్పాటు





**దుబ్బాకప్రతినిధి మార్చి 13(వార్త సంధ్య ) :** సిద్దిపేట జిల్లా దుబ్బాక మున్సిపాలిటీలోని స్థానిక 8వ వార్డులో నిన్న సాయంత్రం ఒక ప్రమాదం చోటుచేసుకుంది. ఓ డీసీఎం వాహనం నియంత్రణ కోల్పోయి విద్యుత్ స్తంభాన్ని బలంగా ఢీకొట్టింది. ప్రమాదం ధాటికి విద్యుత్ స్తంభం పూర్తిగా విరిగిపోవడంతో వార్డులోని కొంత ప్రాంతంలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. విషయం తెలుసుకున్న వెంటనే 8వ వార్డు కౌన్సిలర్ మెరుపుల సాయికుమార్ గౌడ్ ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. అనంతరం విద్యుత్ శాఖ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను వివరించారు. కౌన్సిలర్ చొరవతో విద్యుత్ శాఖ సిబ్బంది యుద్ధ ప్రాతిపదికన స్పందించి, విరిగిపోయిన పాత స్తంభం స్థానంలో కొత్త విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. దీంతో స్థానిక ప్రజలు ఉపశమనం పొందారు.

# మావోయిస్టుల దారెటు : రాజకీయాల్లోకి వస్తారా

**వస్తే ఏ పార్టీ వైపు నిలబడతారు**

**50 ఏళ్ల దండకారణ్యంలో ఉన్న గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు సమాచారం**

**ఆపరేషన్ కగార్ వల్ల లొంగిపోయిన వేలాది మంది మావోయిస్టులు**

**మాతృ పార్టీ నేతలతో దేవ్‌జీ నేతృత్వంలో మాజీ మావోయిస్టులు భేటీ**

దేశంలో మావోయిస్టుల ఉనికి ఇక ప్రశ్నార్థకమేనా? ఇదివరకు జరిగిన అగ్ర నేతల లొంగుబాటుతో అవుననే సమాధానం వస్తోంది. ఇప్పటికే అగ్ర నేత దేవ్‌జీ లొంగిపోగా, 50 ఏళ్ల దండకారణ్యంలో మగ్గిన గణపతి త్వరలో లొంగిపోనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఈ లొంగుబాటుతో ఇక నక్సల్స్ కథ ముగిసినట్లేనా? దేశంలో తాడిత పీడిత ప్రజల కోసం ఆవిర్భవించిన మావోయిస్టు పార్టీ దాదాపు అర్ధ శతాబ్దం ప్రజల పక్షాన నిలిచింది. దొరలు, పెత్తందారుల రాక్షసత్వానికి నలిగిపోయిన బాధకు గురైన బడుగు బలహీన వర్గాలు, విద్యావంతులు, మేధావులు, యువత అడవి బాట పట్టారు. గిరిజనులు, ఆదివాసీలు నిరుపేదలకు రక్షణగా తుపాకులతో పహారా కాశారు. తమ జీవితాలను త్యాగం చేసి, ఎంతో మంది పేద ప్రజల జీవితాల్లో వెలుగులు నింపారు. పేద ప్రజలను పట్టి పీడిస్తున్న దోపిడీ పెత్తందారుల నుంచి విముక్తి కల్పిస్తూ అనేక మిలిటెంట్ ఉద్యమాలు చేశారు. ఈ ఉద్యమాల్లో ఎన్‌కౌంటర్ల పేరుతో వేలాది మంది అమరులయ్యారు.

**మావోయిస్టుల ఉనికి ప్రమాదంలో :** నానాటికీ పెరిగిపోతున్న సాంకేతికత, మారిపోతున్న నాగరికత మావోయిస్టు ఉద్యమంపై తీవ్ర ప్రభావం చూపింది. దండకారణ్యం అబూజ్‌మడ్ అడవుల్లో తల దాచుకున్న మావోయిస్టులకు శాస్త్ర పరిజ్ఞానం యమపాశంగా మారింది. ఒక వైపు అంతరించిపోతున్న అడవులు, పెరిగిపోయిన సాంకేతికత, ప్రజల నుంచి ఆశించినంత ఆదరణ లేకపోవడంతో మావోయిస్టు ఉనికి ప్రమాదంలో పడింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా ఆపరేషన్ కగార్‌కు తెరలేపింది. దేశంలో నక్సల్స్ ప్రభావిత రాష్ట్రాలు అయిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా, మహారాష్ట్ర అడవుల్లో కేంద్ర బలగాలు సాంకేతికతను ఉపయోగించి మావోయిస్టుల ఏరివేతను లక్ష్యంగా పెట్టుకున్నాయి.

**జన జీవన స్రవంతిలో కలిసిపోతున్న మావోయిస్టులు :** కేంద్ర బలగాలు అడవిలోకి వెళ్లి క్యాంపులు ఏర్పాటు చేసుకుని, ఎన్‌కౌంటర్ల పేరుతో వేలాది మందిని తుదముట్టించింది. ఒకవైపు ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్రం ప్రతీకార చర్యలు, మరోవైపు ప్రజల నుంచి ఆదరణ కరవు, అడవులు అంతరించిపోతుండటం మావోయిస్టులను ఆలోచనలో పడేశాయి. ప్రజల్లో స్వార్ధ ప్రయోజనాలు పెరిగినందున, అడవిని వీడి జనం బాట పట్టాలని మావోయిస్టు కేంద్ర కమిటీలో తీవ్ర చర్చ జరిగింది. దీనిని కొంత మంది స్వాగతించగా, మరికొంత మంది వ్యతిరేకించారు. తాజా పరిణామాల నేపథ్యంలో వేలాది మంది మావోయిస్టులు లొంగిపోయారు. మల్లోజుల వేణుగోపాల చారి, దేవ్ జీ లాంటి అగ్ర నేతలు



లొంగిపోగా, హిడ్మా ఎన్‌కౌంటర్ పేరుతో హతం అవడంతో అడవుల్లోని అన్నలు ఆయుధం వీడి ఓటు అనే వజ్రాయుధంలో బుద్ధి చెప్పాలని సంకల్పించి పెద్ద ఎత్తున జన జీవన స్రవంతిలో కలిసిపోయారు.

**గణపతి లొంగిపోతే ఉద్యమం ముగిసినట్లేనా? :** మావోయిస్ట్ పార్టీ ఉద్యమ అగ్రనేత గణపతి సైతం తొందరలోనే ఢిల్లీలో లొంగిపోనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇక గణపతి లొంగుబాటుతో మావోయిస్టు ఉద్యమం ముగిసినట్లేనని రాజకీయ వర్గాల్లో చర్చ నడుస్తోంది. ఈ ఉద్యమాన్ని నడిపించిన కీలక నేతలు, వేలాది మంది లొంగిపోయిన మావోయిస్టులు ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే మాతృ పార్టీ అయిన సీపీఐలో చేరాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర కౌన్సిల్ సమావేశాల వేదిక నుంచి పిలుపునిచ్చారు. వారందరినీ కలిసికట్టుగా అందరం కూర్చొని నిర్ణయాలు తీసుకుని ప్రజల పక్షాన పోరాటం చేద్దామని సూచించారు. మరోవైపు ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డి దేవ్‌జీ లాంటి అగ్ర నేతలతో రాజకీయ ఎజెండాతో భేటీ అయ్యారు.

**ఇవాళ మాజీ మావోయిస్టులు భేటీ :** కాంగ్రెస్‌లో చేరాలనుకునే లొంగిపోయిన మావోయిస్టులు పీసీసీ చీఫ్‌ను సంప్రదించాలని కోరారు. మావోయిస్టు ఉద్యమాన్ని అర్ధ శతాబ్దం పాటు నడిపిన అగ్ర నాయకులు అత్యంత విద్యావంతులు, మేధావులు కావడం, నిస్వార్థ ప్రయోజనాలు కలిగి ఉండటం తమ పార్టీకి బలం చేకూరుతుందని రాజకీయ పార్టీలు అంతర్గతంగా చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. మొత్తంగా లొంగిపోయిన మావోయిస్టులు రాజకీయాల్లోకి వస్తారా? వస్తే మాతృ పార్టీ అయిన సీపీఐలో చేరతారా? లేక కొత్త పార్టీ ఏమైనా పెడతారా? వేచి చూడాలి.

# “ప్రోత్సాహకాలు లేకుండా పెట్టుబడులకు ఎవరు ముందుకొస్తారు“

**వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని ప్రశ్నించిన హైకోర్టు**

**ప్రభుత్వ పాలసీలు, భూకేటాయింపులపై గురుమూర్తి పిల్‌పై హైకోర్టు విచారణ**

**మార్కెట్ ధరకు భూములిస్తామంటే కంపెనీలు దండం పెడతాయని వ్యాఖ్య**

**కంపెనీలు తమకు అనుకూల ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందన్న హైకోర్టు**




కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాల్లో వ్యత్యాసాలు ఉన్నాయని, మొత్తం రాష్ట్రాభివృద్ధిని అడ్డుకోలేమని హైకోర్టు స్పష్టం చేసింది. ప్రోత్సాహకాలు ఇవ్వకపోతే పెట్టుబడులు పెట్టేందుకు ఎవరు వస్తారని వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని హైకోర్టు ప్రశ్నించింది. ప్రభుత్వ పాలసీలపై గురుమూర్తి వేసిన పిల్‌పై న్యాయస్థానం విచారణ జరిపింది. రాజకీయ నాయకుడిగానే మీరు పిల్ వేశారని వ్యాఖ్యానించింది.ప్రపంచ దేశాలు, పక్క రాష్ట్రాలతో పోటీని తట్టుకొని, పెట్టుబడులను రాబట్టాలి అంటే ప్రోత్సాహకాలు ఇవ్వకుండా ఎవరు ముందుకు వస్తారని వైఎస్సార్సీపీ ఎంపీ గురుమూర్తిని హైకోర్టు సూటిగా ప్రశ్నించింది. మార్కెట్ ధరకు భూములిస్తామంటే రాష్ట్ర ప్రభుత్వం అంటే కంపెనీలు దండం పెట్టి తమకు అనుకూల ప్రాంతాలకు వెళ్లే ప్రమాదం ఉందని న్యాయస్థానం పేర్కొంది.

**గురుమూర్తి పిల్‌పై హైకోర్టు విచారణ:** ప్రభుత్వం తీసుకు వచ్చిన విధానాలు (పాలసీలు), వివిధ సంస్థలకు భూముల కేటాయింపును సవాలు చేస్తూ గురుమూర్తి హైకోర్టులో పిల్ వేశారు. దీని పై ధర్మాసనం విచారణ జరిపింది. అభివృద్ధిలో పక్క రాష్ట్రాలతో పోటీ పడాలి అంటే భారీ స్థాయిలో పారిశ్రామికీకరణ జరగాలని, పెద్ద ఎత్తున పెట్టుబడులు రావాలని హైకోర్టు పేర్కొంది.ప్రభుత్వ విధానంలో వివిధ సంస్థలకు భూమి కేటాయింపును ఒక అంశంగా మాత్రమే చూడాలి అని దాని వల్ల భవిష్యత్తులో విస్తృత ప్రయోజనాలు ఉంటాయని స్పష్టం చేసింది. ప్రభుత్వ విధానాలతో ఐటీ ఎకో సిస్టం అభివృద్ధి చెందితే 200 ఏళ్ల పాటు ప్రయోజనాలు ఉంటాయని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ ప్రయత్నాలను అడ్డుకోవడానికి తాము ఇక్కడ లేమని హైకోర్టు తేల్చి చెప్పింది. కంపెనీలకు ఇచ్చే ప్రోత్సాహకాల మధ్య వ్యత్యాసాలు ఉండవచ్చని, ఈ కారణంతో మొత్తం అభివృద్ధిని అడ్డుకోలేమని స్పష్టం చేసింది. కంపెనీలకు భూకేటాయింపుల విషయంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన పాలసీని మేము విస్తృత కోణంలో చూడాల్సి ఉంటుందని హైకోర్టు వెల్లడించింది.

**పరిశ్రమల ఏర్పాటుకు యత్నం:** రాష్ట్ర విభజన తర్వాత ఏపీ వ్యవసాయ ఆధారిత రాష్ట్రంగా మిగిలి పోయిందని, ఈ నేపథ్యంలో పరిశ్రమలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం యత్నిస్తోందని న్యాయస్థానం గుర్తు చేసింది. ప్రభుత్వ విధానాల వల్ల తాము పెట్టుబడులు పెట్టలేకపోతున్నామని ఏ ఒక్క కంపెనీ న్యాయస్థానానికి రాలేదు కదా అని ప్రశ్నించింది. రాజకీయ నాయకుడిగా మీరు ప్రభుత్వ విధానాన్ని సవాలు చేస్తూ, పిల్ వేశారని గురుమూర్తిని ఉద్దేశించి హైకోర్టు వ్యాఖ్యానించింది.ప్రభుత్వ విధాన పరమైన నిర్ణయాల్లో న్యాయస్థానాలు సహజంగా జోక్యం చేసుకోవని, తమ పాత్ర పరిమితమైందని తెలిపింది. భూకేటాయింపులు, ప్రభుత్వ విధానాలను సవాలు చేస్తూ ఇప్పటికే పలు ప్రజాహిత వ్యాజ్యాలు వేశారని గుర్తు చేసింది. ఇలాంటి చర్యలను అనుమతించబోమని స్పష్టం చేసింది. ప్రస్తుత పిల్‌లో కౌంటర్ వేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. గతంలో దాఖలైన వ్యాజ్యాలతో ఈ పిల్‌ను జత చేయాలని రిజిస్ట్రీని ఆదేశించింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చల్లా గుణరంజన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం (నిన్న) ఈ మేరకు ఉత్తర్వులు ఇచ్చింది.

# మరో ట్రెండ్‌కు మల్లారెడ్డి శ్రీకారం!

**‘విరోష్‘ తరహాలో గ్రాండ్‌గా ‘మల్పన‘ వెడ్డింగ్**

**మరోసారి పెళ్లి కుమారుడిగా ముస్తాబవుతున్న మాజీ మంత్రి మల్లారెడ్డి**

**ఉగాది రోజున సతీమణి కల్పనను మరోసారి మనువాడనున్న మల్లారెడ్డి**

**వివాహబంధంలో 50 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవం**



మల్లారెడ్డి రెండు తెలుగు రాష్ట్రాల్లో పెద్దగా పరిచయం అక్కర్లేని పేరు ఇది. ఆయన ఏం చేసినా అది వైరల్‌గా మారుతుంది. డెబ్బై పదుల వయసులోనూ ఆయన ఉత్సాహం నవ యువకుడిలా ఉంటుంది. పూలమ్మినా, పాలమ్మినా, కష్టపడ్డా అంటూ ఆయన చెప్పిన డైలాగ్ ఎంత ఫేమస్ అయిందో ప్రత్యేకించి చెప్పనక్కరలేదు. కాలేజీ, సినిమా రిలీజ్ ఫంక్షన్లలో ఆయన చెప్పే డైలాగులు, నృత్యాలు ఎవరూ మర్చిపోలేరు. స్టార్ హీరోలతో సమానంగా స్టెప్‌లు వేస్తూ అందరినీ అలరిస్తూ నవ్వులు పూయిస్తుంటారు.తాజాగా మల్లారెడ్డి మరోసారి వార్తల్లో నిలిచారు. ఇంతకీ విశేషం ఏమంటారా? ఆయన మళ్లీ పెళ్లికుమారుడు కాబోతున్నారు. 50 ఏళ్ల వివాహ మహోత్సవ వేడుకలో భాగంగా తన శ్రీమతి కల్పనను మరోసారి మనువాడనున్నారు. ఉగాది రోజున నిర్వహించే ఈ వేడుకలో సంగీత్, హల్దీ వంటి కార్యక్రమాలు అట్టహాసంగా జరగనున్నాయి. ‘విరోష్‘ పెళ్లి తరహాలో మల్లారెడ్డి దంపతులు ‘మల్పన‘ పేరుతో ట్రెండ్ సెట్ చేసేందుకు సిద్ధమయ్యారు.

**మళ్లీ పెళ్లి చేసుకోనున్న మల్లారెడ్డి :** చామకూర మల్లారెడ్డి. నిత్యం ఏదో ఒక హడావుడితో వార్తల్లో నిలవడం ఆయన ప్రత్యేకత. రాజకీయాలు, విద్య, వ్యాపారం, కుటుంబం ఇలా ఏ రంగంలోనైనా స్పెషల్ అట్రాక్షన్‌గా నిలుస్తారు. ప్రస్తుతం 72 ఏళ్ల వయసులో మల్లారెడ్డి మరోమారు కొత్త ట్రెండ్ సృష్టిస్తున్నారు. మల్లారెడ్డి, ఆయన సతీమణి కల్పనకు వివాహం జరిగి ఈ నెల 19వ తేదీతో 50 వసంతాలు అవుతోంది. వివాహ స్వర్ణోత్సవాన్ని ఘనంగా చేసుకునేందుకు సిద్ధమయ్యారు ఈ జంట. ఏదో ఒక రోజు అట్టహాసంగా చేసుకునే వేడుకలా కాకుండా ప్రస్తుతం పెళ్లిళ్ల తరహాలోనే సంగీత్, హల్దీ లాంటి కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నారు. అవి కూడా ఒక్కో రోజు ఒక్కో చోట నిర్వహిస్తున్నారు.

**వేడుకల్లో భాగంగా కార్యక్రమాల వివరాలు ఇవే :** వేడుకల్లో భాగంగా ఈ నెల 12న సత్యనారాయణ స్వామి వ్రతం, 13న మల్లికార్జున స్వామి కల్యాణం జరపనున్నారు. ఈ రెండు వేడుకల్ని బోయిన్‌పల్లిలోని మల్లారెడ్డి నివాసంలో నిర్వహిస్తారు. మేడ్చల్ సమీపంలోని అద్వయ కన్వెన్షన్ హాల్‌లో ఈ నెల 14న సంగీత్, కొంపల్లిలోని మల్లారెడ్డి కుమారుడు భద్రారెడ్డి నివాసంలో 16న మెహందీ, హల్దీ కార్యక్రమాలు జరుపుతారు. ఈ నెల 19న కొంపల్లిలోని మరో కుమారుడు మహేందర్ రెడ్డి నివాసంలో వివాహ వేడుకల్ని చేయనున్నారు.

**‘మల్పన‘ పేరుతో స్వర్ణోత్సవ వేడుకలు :** వివాహ వేడుకల్లో భాగంగా రాంపల్లిలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఇటీవల ప్రారంభించారు. మల్లారెడ్డి తన వివాహ స్వర్ణోత్సవానికి ఇప్పటికే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు పార్టీ ముఖ్యనేతలు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులను ఆహ్వానించారు. కేటీఆర్ సూచన మేరకు మల్లారెడ్డి, ఆయన సతీమణి కల్పన పేర్లు కలిసివచ్చేలా “మల్పన“ పేరుతో వివాహ స్వర్ణోత్సవ వేడుకలు చేసుకుంటున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.ప్రస్తుత కాలంలో చిన్న చిన్న కారణాలతోనే భార్యాభర్తలు విడిపోతున్నారని, పరస్పరం అర్థం చేసుకోవడం ద్వారా మాత్రమే 50 ఏళ్లుగా కలిసి ఉన్నామన్న సందేశం ఇవ్వడం కోసమే వివాహ స్వర్ణోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహిస్తున్నట్లు మల్లారెడ్డి చెప్పారు. ఈ కార్యక్రమాలకు ఇప్పటికే ఏర్పాట్లు చేస్తున్నారు. తాజా వివాహ వేడుక ద్వారా ఆయన రెండు రాష్ట్రాల్లో వార్తల్లో నిలిచారు. సోషల్ మీడియాలో ఎక్కడ చూసినా మల్లారెడ్డి వివాహ పోస్టులే వైరల్ అవుతున్నాయి. తాజా కార్యక్రమం ద్వారా ఆయన మరోసారి హాట్‌టాపిక్‌గా మారారు. ఆయన వివాహ స్వర్ణోత్సవ వేడుకలకు సినీ, రాజకీయ, వ్యాపార రంగ ప్రముఖులు హాజరుకానున్నట్లుగా తెలుస్తోంది.

# పశ్చిమాసియాలో యుద్ధం వల్ల గ్యాస్ కొరత

**సిలిండర్లు దొరక్క హోటళ్ల యజమానుల ఇబ్బందులు**

**సిలిండర్ రూ.3500 వరకు అమ్ముతున్నారని ఆరోపణ**

**బ్లాక్ మార్కెట్‌ను కట్టడి చేయాలని ప్రభుత్వానికి వినతి**

**అత్యవసరంగా సమావేశమైన హోటళ్ల అసోసియేషన్ నేతలు**

**గ్యాస్ వినియోగం తగ్గించాలని హోటళ్ల యాజమాన్యానికి సూచన**




పశ్చిమాసియాలో యుద్ధం హోటల్ రంగానికి శాపంలా మారింది. నిత్యం వంట మంటలతో భగభగలాడే హోటళ్లలోని పాకశాలలు గ్యాస్ సిలిండర్లు లేక చల్లబడిపోతున్నాయి. గ్యాస్ కొరత మరింత తీవ్రమైతే హోటళ్లు, రెస్టారెంట్లు పూర్తిగా మూసివేయాల్సి వస్తుందని యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రంగాన్ని నమ్ముకున్న చాలా మంది రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు:** ఇరాన్‌పై ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం హోటల్ రంగంపై పెను ప్రభావం చూపుతోంది. ఎల్‌పీజీ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. విజయవాడలో వన్ స్టార్ నుంచి త్రీస్టార్ వరకు వంద హోటళ్లు ఉండగా, మరో 350 వరకు మాదిరి హోటళ్లు, రెస్టారెంట్లు ఉన్నాయి. రోడ్డు పక్కన పెట్టే చిన్నచిన్న హోటళ్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ల వారు చాలా మందే ఉన్నారు. వీరంతా గ్యాస్ కొరత వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 19 కిలోల సిలిండర్ ఒకప్పుడు 2 వేలు ఉండేదని, ప్రస్తుతం 3 వేల నుంచి 3500 వరకు అమ్ముతున్నారని యజమానులు చెబుతున్నారు. అధిక ధరకైనా కొందామంటే అదీ దొరకట్లేదంటున్నారు.హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి: ప్రస్తుతం పెళ్లిళ్ల సీజన్ కావడంతో ఇది హోటల్ రంగానికి అత్యంత గిరాకీ సమయం. వివాహాలు, ఇతర శుభకార్యాలు చేసేవారు. హోటళ్లకు భారీ ఫుడ్ ఆర్డర్లు ఇస్తారు. గ్యాస్ కొరత వల్ల ఆర్డర్లు తీసుకోలేకపోతున్నామని హోటళ్ల యజమానులు చెబుతున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొన్ని రోజుల్లో హోటళ్లు మూసివేయాల్సిన పరిస్థితి నెలకొంటుందని చెబుతున్నారు.

**హోటళ్ల యజమానులకు పలు సూచనలు:** యుద్ధం నేపథ్యంలో కమర్షియల్ గ్యాస్ కొరతపై రాష్ట్ర హోటల్స్ అసోసియేషన్, స్టార్ హోటల్స్ అసోసియేషన్ అత్యవసరంగా విజయవాడలో సమావేశమైంది. గ్యాస్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అసోసియేషన్ సభ్యులు సూచించారు. ఈ మేరకు హోటళ్ల యజమానులకు పలు సూచనలు చేశారు. గ్యాస్ వినియోగాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలని అసోసియేషన్ సూచించింది. అందుకోసం కఠిన నిర్ణయాలు తీసుకోవాలని నిర్ణయించింది. గ్యాస్ పొదుపు చర్యల్లో భాగంగా స్టార్ హోటళ్లలో జొమాటో, స్విగ్గీలు వంటి ఆన్‌లైన్ ఆర్డర్లను త్వరలోనే నిలిపి వేస్తామని అసోసియేషన్ ప్రతినిధులు స్పష్టం చేశారు. గ్యాస్ ఆదా చేసేందుకు ప్రతి సోమవారం రెస్టారెంట్లను పూర్తిగా మూసివేసి, ‘వీక్లీ హాలిడే‘ ప్రకటించనున్నారు. దీని వల్ల కొంతవరకు గ్యాస్ ఆదా అవుతుందని వారు భావిస్తున్నారు.“మొదటి విడతగా డిస్కౌంట్ అనేది పూర్తిగా రద్దు చేయండి. దానివల్ల కొంతమేరకు ఆర్డర్లు తగ్గుతాయి. తద్వారా 10 శాతం వ్యాపారం తగ్గేందుకు ఆస్కారం ఉంటుంది. అలాగే రెండవ విడతగా స్విగ్గీ, జొమాటోలను ఆపేయండి. తద్వారా 25-30 శాతం వరకు వ్యాపారం తగ్గుతుంది. ప్రతీ సోమవారం రెస్టారెంట్లు అన్నింటినీ మూసి వేయండి. వీక్లీ హాలిడే ప్రకటిస్తే గనక కొంత వినియోగాన్ని ఆదా చేసుకోవచ్చు. కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు వినియోగించే వారికి వీలైనంత వరకు సప్లై కొరత లేకుండా చూడాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నాం.కర్ణాటక తరహాలో ఏపీలోనూ కొన్ని హోటల్స్ కేవలం టీ, కాఫీలు మాత్రమే విక్రయించే పరిస్థితి రాబోతోందని పేర్కొన్నారు. రాత్రి 10 గంటల వరకే రెస్టారెంట్లు, స్ట్రీట్ ఫుడ్ సెంటర్లను నడిపేలా సమయం కుదించేలా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయాలని కోరుతున్నారు. బ్లాక్ మార్కెట్‌ను అరికట్టేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలని, డొమెస్టిక్ గ్యాస్ మాదిరిగానే కమర్షియల్ గ్యాస్‌ను కూడా సరఫరా చేయాలని కోరారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నాదెండ్ల మనోహర్‌లను కలిసి వినతి పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు. ఆతిథ్య రంగంపై ఆధారపడిన వేల మంది కార్మికులు వీధిన పడకుండా చూడాలని, హాస్పిటాలిటీ రంగాన్ని ప్రాధాన్యత రంగంగా గుర్తించాలని వారు విజ్ఞప్తి చేశారు.

# గ్యాస్ కొరతతో రెస్టారెంట్లలో మారిన మెనూ కార్డు

**ఆ క్రేజీ ఐటెమ్స్ ఔట్**

**ముందుగా బుక్ చేసుకున్న పెళ్లిళ్లు, రిసెప్షన్‌లకే ఆతిథ్యం**

**వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను ఏజెన్సీలు నిలిపేయడంతో స్టార్ హోటళ్లకు అంతరాయం**

**పలు ప్రాంతాల్లో పెరిగిన కట్టెల పొయ్యిల వినియోగం**

పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను ఏజెన్సీలు నిలిపేయడంతో స్టార్ హోటళ్లు విద్యుత్ స్టవ్‌లు, ఆవిరి యంత్రాలపై వంటలు చేయిస్తున్నాయి. అంతేకాదు ముందుగా బుక్ చేసుకున్న పెళ్లిళ్లు, రిసెప్షన్ ఇలాంటి వేడుకలకు మాత్రమే ఆతిథ్యం ఇవ్వనున్నాయి. నగరంలోని కొన్ని స్టార్ హోటళ్లలో విదేశీ అతిథులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వారికి సంపూర్ణ ఆతిథ్యాన్ని అందిస్తున్నారు. ప్రస్తుతం తమ వద్ద కేవలం ఒకట్రెండు రోజులకు మాత్రమే సరిపడేలా ఉన్న నేపథ్యంలో ఏజెన్సీలు సరఫరా చేయకపోతే కేవలం అతిథులకు మాత్రమే ఆహారం అందించేందుకు వీలవుతుందని ఫైవ్‌స్టార్ హోటల్ ప్రతినిధి ఒకరు తెలిపారు.

**హోటల్ మెనూలో మార్పులు :** గ్యాస్ కొరత దృష్ట్యా కొన్ని స్టార్ హోటళ్ల మెనూలో మార్పులు చేశారు. ఇంధనం ఎక్కువగా వినియోగించే గ్రిల్డ్ చికెన్, మటన్, కబాబ్‌లను మెనూలో నుంచి తొలగించారు.బంజారాహిల్స్‌లోని ఒక స్టార్ హోటల్ రోజుకు 50 సిలిండర్లను వాడుతున్నారు. అయితే సరఫరా ఉండబోదనే అంచనాలతో భోజనం తినేందుకు మాత్రమే వస్తున్న వారికి కొన్నే ఆహార పదార్థాలు ఉన్నాయని తెలుపుతున్నారు.హైదరాబాద్ లక్డీకపూల్‌లోని షాగౌస్ హోటల్‌లో బుధవారం మధ్యాహ్నం కట్టెల పొయ్యిపైనే బిర్యానీ చేసినట్లు హోటల్ యజమాని రబ్బానీ పేర్కొన్నారు. గ్రేటర్ పరిధిలోని ప్యారడైజ్ హోటళ్లలో అవసరమైన చోట్ల విద్యుత్‌పై వంటలు చేస్తున్నారని ప్యారడైజ్ ఫుడ్‌కోర్టు ఎండీ అభిక్ మిత్రా తెలిపారు.ప్రభుత్వం స్పందించాలి – లేదంటే అంతే సంగతులు : హైదరాబాద్‌లో ఐటీ ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో వసతి పొందుతున్న ప్రైవేటు పీజీ హాస్టళ్లకు వాణిజ్య గ్యాస్ సిలిండర్ల సరఫరాను వెంటనే ప్రారంభించాలని తెలంగాణ రాష్ట్ర ఐటీ కారిడార్ హాస్టల్ అసోసియేషన్ కోరింది. రాయదుర్గంలో బుధవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో అసోసియేషన్ అధ్యక్షుడు అమర్‌నాథ్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కరుణాకర్, కోశాధికారి మహీదర్ తదితరులు మాట్లాడారు. హైదరాబాద్‌లోని 11 వేల హాస్టళ్లలో వసతి పొందుతున్న 10 లక్షల మంది ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఒక్కో హాస్టల్‌లో దాదాపు 100 నుంచి 300 మంది వరకు ఉన్నారని, ఒక వాణిజ్య సిలిండర్ రెండు రోజులు వస్తుందని పేర్కొన్నారు. కానీ మంగళవారం సాయంత్రం నుంచి ఈ సరఫరా కూడా నిలిపివేశారన్నారు. అంతేకాదు తాజాగా 35 శాతం ధర పెరిగినా భరిస్తున్నామన్నారు. వాణిజ్య సిలిండర్ల కొరత ఉంటే గృహావసరాలకు పంపిణీ చేసే వాటినైనా అందించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వాలు స్పందించాలని, లేదంటే హాస్టళ్లను మూసివేయాల్సిన పరిస్థితి వస్తుందని తెలిపారు.

**గ్యాస్ లేక కష్టాలు – కట్టెల పొయ్యిల వినియోగం :** కేంద్ర సర్కార్ ఆదేశాల మేరకు వాణిజ్య, రాయితీయేతర సిలిండర్ల సరఫరాను రాష్ట్ర ప్రభుత్వం ఆపేయడంతో ఆసుపత్రులు, గురుకులాలు, హాస్టళ



,, హోటళ్లకు ఇబ్బందులు తలెత్తుతున్నాయి. హైదరాబాద్ చర్లపల్లిలోని భారత్, ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్, హిందుస్థాన్ పెట్రోలియం ఇంధన సరఫరా 75 శాతం తగ్గింది. రాష్ట్రంలో కోటి 30 లక్షలకు పైగా గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. ప్రతి నెల దాదాపు 20 లక్షల వాణిజ్య, రాయితీయేతర సిలిండర్లే సరఫరా అవుతున్నాయి. పరిశ్రమల అవసరాల కోసం బల్క్ ఎల్‌పీజీ వినియోగం సైతం ప్రతి నెల సుమారు 20-22 వేల టన్నులు వినియోగిస్తున్నారు. ఆటోలు, కార్ల ఎల్‌పీజీ వాడకం కూడా నెలకు 9-10 వేల టన్నుల వరకు ఉంది.

**వివిధ రంగాలపై ప్రభావం :**

రాష్ట్రంలో 295 ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులకు కేటరింగ్ సంస్థల ద్వారా ఆహార సరఫరా జరుగుతుండగా, ప్రస్తుతం వాటికి సిలిండర్ల సరఫరా ఆగిపోయింది.తెలంగాణలో 1200కి పైగా ఎస్టీ, ఎస్సీ, బీసీ, మైనారిటీ, దివ్యాంగుల గురుకులాలు వసతి గృహాలున్నాయి. వీటన్నింటికి సిలిండర్ల ద్వారా వంట చేస్తున్నారు. ప్రతి గురుకులం, వసతి గృహానికి వారానికి 11, నెలకు 40-45 సిలిండర్లు వినియోగిస్తున్నారు.రైల్వే కేటరింగ్ లైసెన్సీలు వెండర్లు, ఫుడ్ ప్లాజాలు, రిఫ్రెష్‌మెంట్ రూమ్‌లు, జన ఆహార్ అవుట్‌లెట్‌లలో గ్యాస్ సిలిండర్లకు బదులుగా మైక్రోవేవ్ ఓవెన్లు, ఇండక్షన్ స్టవ్‌లు వాడాలని ఐఆర్‌సీటీసీ ఆదేశాలు జారీ చేసింది. ఒకవేళ భోజనం అందించలేకపోతే ఆహారం కోసం చెల్లించిన డబ్బులను తిరిగి ప్రయాణికులకు చెల్లించనున్నట్లు తెలిపింది.రాష్ట్రంలో ప్రతి నెలా 58-60 లక్షల వరకు గృహ వినియోగ సిలిండర్లు బుకింగ్ అవుతుంటాయి. కానీ గత రెండు రోజుల్లోనే 12 లక్షలు బుక్ అయ్యాయి. కొరత పెరగడంతో పొయ్యిలు, కుంపట్లపై పలువురు దృష్టి పెట్టడంతో కట్టెలు, బొగ్గుల వినియోగం బాగా పెరిగింది. బుధవారం ఒక రోజునే 10 టన్నుల కట్టెలను విక్రయించినట్లు ఎల్బీనగర్‌లోని కట్టెల వ్యాపారి పేర్కొన్నారు.

# ఏప్రిల్ 1 నుంచి కొత్త “పాన్‌కార్డ్ రూల్స్“

## ఇవి తెలుసుకోకపోతే బ్యాంక్ ట్రాన్సాక్షన్స్ ఆగిపోవచ్చు!

## కొత్త ఆదాయపు పన్ను చట్టానికి అనుగుణంగా పాన్‌లో మార్పులు

## నగదు డిపాజిట్ నుంచి ఇన్సూరెన్స్ పాలసీల వరకు!

ఇండియాలో ఫైనాన్షియల్ ట్రాన్సాక్షన్స్‌కు “పాన్ కార్డు“ అనేది చాలా కీలకంగా ఉంటుంది. బ్యాంక్ అకౌంట్ దగ్గర నుంచి ఐటీ రిటర్నుల ఫైలింగ్ వరకు అన్నింటికీ ఇది ఉండాల్సిందే. ఆర్థిక లావాదేవీల విషయంలో భారతీయులకు ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఒకటైన పాన్‌కార్డుకు సంబంధించి ఏప్రిల్ 1, 2026 నుంచి కొన్ని కొత్త రూల్స్ రాబోతున్నాయి. ప్రస్తుతం అమలులో ఉన్న రూల్స్ ప్రకారం, చిన్న మొత్తాలకే పాన్ అవసరం పడుతుంది. అయితే, రాబోతున్న కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025కు అనుగుణంగా రూపొందించిన డ్రాఫ్ట్ రూల్స్‌లో పాన్‌కు సంబంధించి కొన్ని కీలక మార్పులు తీసుకొస్తున్నారు. మరి, ఏప్రిల్ 1 నుంచి పాన్ కార్డు వినియోగంలో రాబోతున్న ఆ కీలకమైన మార్పులేంటో ఇప్పుడు చూద్దాం. 1961 పాత ఆదాయపు పన్ను చట్టం ప్లేస్‌లో కేంద్ర ప్రభుత్వం కొత్త ఆదాయపు పన్ను చట్టం-2025 తీసుకొస్తున్న విషయం తెలిసిందే. అందుకు అనుగుణంగా రూపొందించిన “ఆదాయ పన్ను ముసాయిదా నిబంధనలు-2026“ ద్వారా పాన్ కార్డు నిబంధనలలో కీలక మార్పులు రానున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఆదాయ పన్ను చెల్లింపుదారులకు, అధిక విలువ కలిగిన లావాదేవీలు నిర్వహించే వారికి ఊరటనిచ్చేలా ఉండనున్నాయి. నగదు డిపాజిట్లు, వాహన కొనుగోళ్లు, స్థిరాస్తి లావాదేవీల విషయంలో సామాన్యులకు మేలు చేయనున్నాయి. కేంద్రం తీసుకొస్తున్న ఈ కొత్త పాన్ కార్డు రూల్స్ 2026, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చే ఛాన్స్ ఉంది.

**నగదు డిపాజిట్, విత్‌డ్రా :**

ప్రస్తుతం ఒక రోజులో బ్యాంకులో 50 వేల రూపాయల కంటే ఎక్కువ మనీ డిపాజిట్ చేసినప్పుడు పాన్ తప్పనిసరి అనే నిబంధన అమలులో ఉంది. అయితే, ఏప్రిల్ 1 నుంచి ఈ విధానంలో మార్పు రానుంది. ఒక ఆర్థిక సంవత్సరంలో ఒకటి లేదా అంతకంటే ఎక్కువ బ్యాంకు అకౌంట్స్‌లో కలిపి మొత్తం రూ.10లక్షలు లేదా అంతకంటే ఎక్కువ నగదు జమ చేసినప్పుడు లేదా విత్‌డ్రా చేసిన సందర్భాల్లో పాన్‌కార్డు తప్పనిసరిగా ఇవ్వాల్సి ఉంటుంది. అంటే, ప్రస్తుతం ఉన్న రోజువారీ పరిమితి స్థానంలో వార్షిక పరిమితి అనే కొత్త నిబంధనను తీసుకొస్తున్నారు.

**హోటల్, ఈవెంట్ ఖర్చులు :**

ఇప్పటి వరకు అమలులో ఉన్న నిబంధనల ప్రకారం హోటల్ లేదా రెస్టరెంట్ బిల్లు రూ.50 వేలు దాటితే పాన్‌కార్డు ఇవ్వాలి. కొత్త నిబంధనల ప్రకారం, ఈ పరిమితిని రూ.1లక్షకు పెంచనున్నారు. ఈ కొత్త నిబంధన అమలులోకి వస్తే హోటళ్లు, రెస్టరెంట్లు, బ్యాంక్వెట్ హాళ్లు లేదా ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థలకు రూ.1లక్షకు మించి ఏదైనా చెల్లింపులు చేసినప్పుడు మాత్రమే పాన్ వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది.

**మోటార్ వాహనాల కొనుగోలు :**

ప్రస్తుతం ఉన్న నిబంధనల ప్రకారం టూ వీలర్స్ కాకుండా మిగతా ఏ వెహికల్ కొనుగోలు చేసినా పాన్ కార్డు ఇవ్వాలి. అయితే, కొత్త రూల్ ప్రకారం ద్విచక్ర వాహనాలతో సహా ఏ వాహనం కొనుగోలు



చేసినా దాని ధర రూ.5లక్షలు దాటితేనే పాన్ తప్పనిసరి చేస్తున్నారు. అలాకాకుండా బైకులు, కార్లు కొనుగోలు చేసినప్పుడు వాటి ధర రూ.5లక్షల కంటే తక్కువ ఉంటే అప్పుడు పాన్‌కార్డు ఇవ్వాల్సిన పని లేదు.

**స్థిరాస్తి లావాదేవీలు :**

ప్రస్తుతం ఉన్న రూల్స్ ప్రకారం రూ.10లక్షలు దాటిన స్థిరాస్తి లావాదేవీలకు పాన్ తప్పనిసరి. అయితే, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధన ప్రకారం ఈ పరిమితిని రూ.20 లక్షలు చేయనున్నారు. దాని ప్రకారం స్థలం, ఇల్లు కొనుగోలు, అమ్మకం లేదా ఉమ్మడి అభివృద్ధి ఒప్పందాల విలువ రూ.20లక్షలు దాటితేనే పాన్‌కార్డు వివరాలు సమర్పించాల్సి ఉంటుంది.

**ఇన్సూరెన్స్ పాలసీలు :**

పైన చెప్పిన అంశాల్లో వెసులుబాటు కల్పించిన కేంద్ర ప్రభుత్వం బీమా రంగంలో మాత్రం పాన్ కార్డ్ రూల్స్‌ను కఠినతరం చేసింది. ప్రస్తుతం ఏదైనా ఇన్సూరెన్స్ పాలసీ తీసుకున్నప్పుడు ప్రీమియం అనేది రూ.50 వేల కంటే ఎక్కువగా ఉంటేనే పాన్ వివరాలు ఇవ్వాలి. కానీ, కొత్త నిబంధనల ప్రకారం బీమా సంస్థల నుంచి ఏ తరహా పాలసీ తీసుకోవాలన్నా పాన్ తప్పనిసరి అనే నిబంధనను తీసుకొస్తున్నారు. అంటే, ఎవరైనా కొత్తగా పాలసీ తీసుకునేటప్పుడు ప్రీమియం మొత్తంతో సంబంధం లేకుండా పాన్‌కార్డు ఇవ్వాల్సిందే. ఏప్రిల్ 1, 2026 నుంచి అమల్లోకి రానున్న కొత్త ఆదాయ పన్ను చట్టం-2025కు అనుగుణంగా పాన్ కార్డుకు సంబంధించిన పైన పేర్కొన్న మార్పులను ప్రతిపాదిస్తున్నారు.

# “కూలర్“ కొంటున్నారా - ఇవి చూసి తీసుకోకపోతే మీ డబ్బులు వృథా!

## మంచి కూలర్ ఎలా సెలెక్ట్ చేసుకోవాలి

## కొనే ముందు ఇవి చూడాలంటున్న నిపుణులు!

మార్చిలో భానుడి భగభగలు మొదలయ్యాయి. పెరిగిన ఉష్ణోగ్రతల కారణంగా ఇంట్లో ఉక్కపోతతో జనాలు ఇబ్బందిపడుతుంటారు. ఈ క్రమంలోనే ఇళ్లలో చల్లదనం కోసం రకరకాల మార్గాలు అనుసరిస్తుంటారు. అందులో మెజార్టీ పీపుల్ ఎయిర్ కూలర్లు కొనుగోలు చేస్తుంటారు. ఎందుకంటే ఏసీతో పోల్చితే తక్కువ ధరకు లభించడం, మెయింటెనెన్స్ కూడా సులభంగా ఉంటుంది కాబట్టి. అయితే, కూలర్ కొనుగోలు చేసేటప్పుడు చాలా మంది తక్కువ ధరకు వస్తుందని, ఫీచర్లు చూడకుండా ఏది పడితే అది కొనేస్తుంటారు. తర్వాత ఇబ్బంది పడుతుంటారు. మరి, ఈ సమ్మర్‌లో మీరూ కొత్త కూలర్ కొనుగోలు చేసే ఆలోచనలో ఉన్నారా? ఎలాంటి ఫీచర్స్ ఉన్న కూలర్ తీసుకుంటే మంచిది? సరైనది ఎలా సెలెక్ట్ చేసుకోవాలో ఈ స్టోరీలో తెలుసుకుందాం. ఎయిర్ కూలర్ కొనే ముందు కొన్ని ఫీచర్లు తప్పక పరిశీలించాలంటున్నారు నిపుణులు. అప్పుడే మీ డబ్బులు వేస్ట్ అవ్వకుండా ఒక మంచి కూలర్ తీసుకోగలుగుతారని సూచిస్తున్నారు. మీరు కూలర్ కొనేటప్పుడు ముఖ్యంగా గుర్తుంచుకోవాల్సిన విషయాల్లో ఒకటి కూలర్ రకం. ఎందుకంటే మార్కెట్లో అనేక రకాల కూలర్లు ఉంటాయి. వాటిల్లో మీ ఫ్యామిలీ అవసరాలకు సరిపోయినదని ఎంచుకోవడం చాలా ముఖ్యమంటున్నారు నిపుణులు.

**కూలర్ టైప్ :** మీ ఇంట్లో చిన్న చిన్న గదులు ఉండి, ఒక ప్లేస్ నుంచి మరో ప్రాంతానికి ఈజీగా తీసుకెళ్లేందుకు అనువుగా ఉండాలంటే పర్సనల్ లేదా టవర్ కూలర్లు ఎంచుకోవడం బెటర్ అంటున్నారు. అయితే, ఇవి ఒకరిద్దరికి మాత్రమే సరిపోతాయని గుర్తుంచుకోవాలి. అలాకాకుండా గదిలో స్థిరంగా ఒకచోట పెట్టాలనుకుంటే మాత్రం విండో కూలర్లు మంచి ఆప్షన్. బాడీ భాగం బయట ఉండి కేవలం ఫ్యాన్ భాగం మాత్రమే లోపల ఉండి విశాలంగా గాలిని అందిస్తుంది. అదే, పెద్ద పెద్ద గదులు ఉండి, ఇంట్లో ఐదారుగురు ఉన్నట్లయితే మాత్రం డిజర్ట్ కూలర్లు ఎంచుకోవడం బెటర్ అంటున్నారు.

**కెపాసిటీ :** ఎయిర్ కూలర్ కొనుగోలు చేసేటప్పుడు తప్పక చూడాల్సిన మరో ముఖ్యమైన ఫీచర్ ‘వాటర్ కెపాసిటీ‘. వీలైనంత వరకు ఎక్కువ వాటర్ కెపాసిటీ ఉన్న వాటిని తీసుకోవడం మంచిది. ఎందుకంటే ప్రతిసారీ నీటిని నింపే ఇబ్బంది ఉండదు. అయితే, చిన్న రూమ్స్ ఉండి చిన్నపాటి కూలర్ కావాలనుకునే వాళ్లకు 20 నుంచి 30 లీటర్ల కెపాసిటీ ఉన్న కూలర్ సరిపోతుందంటున్నారు నిపుణులు. అదే, పెద్ద రూమ్స్ ఉంటే 30 నుంచి 40 లీటర్ల కెపాసిటీ ఉండేవి ఎంచుకోవడం మంచిదంటున్నారు.

**“పాత కూలర్“ ఇలా క్లీన్ చేయండి! - కొత్తదానిలా మంచి స్పీడ్, స్వచ్ఛమైన గాలి!**

**కూలర్ ప్యాడ్ ఎంపిక :** మంచి కూలర్ ఎంపికలో కూలింగ్ ప్యాడ్లు కూడా కీలకం. మార్కెట్లో యాస్పెన్ ప్యాడ్, హనీ ప్యాడ్ అనే రెండు రకాల కూలింగ్ ప్యాడ్‌లతో కూలర్లు ఎక్కువగా అందుబాటులో ఉంటుంటాయి. యాస్పెన్ ప్యాడ్ అంటే గడ్డి తరహాలో ఉండే కూలింగ్ ప్యాడ్లు. తక్కువ ధరకు లభించే వాటిల్లో ఈ తరహావే ఉంటాయి. వీటి మన్నిక కూడా తక్కువని గుర్తించుకోవాలి. హనీ ప్యాడ్ అంటే తేనె తుట్టెను పోలిన కూలింగ్ ప్యాడ్లు. వీటి ధర కాస్త ఎక్కువైనప్పటికీ ఎక్కువ మన్నికనిస్తాయి. గదిని కూల్‌గా ఉంచడంలోనూ ఇవి మెరుగ్గా పని చేస్తాయంటున్నారు నిపుణులు. కాబట్టి, కాస్త అధిక ధర పెట్టగలిగే వారు ఈ రకం కూలింగ్ ప్యాడ్లు కలిగిన కూలర్లు ఎంచుకోవడం బెటర్ అంటున్నారు.

**ఈ ఫీచర్లూ ఉంటే ఇంకా బెటర్!**

కూలర్ తీసుకునేటప్పుడు చప్పుడు తక్కువగా ఉండేలా చూసుకోవడం మంచిది. ఎందుకంటే చప్పుడు ఎక్కువగా ఉంటే రాత్రి వేళల్లో నిద్రకు డిస్టర్బ్ కలిగించవచ్చు. అందుకే, కొనే ముందే ఒకసారి చెక్ చేసుకోవాలి. సాధారణ కూలర్లలో డస్ట్ ఫిల్టర్ వంటి ఆప్షన్లు ఉండకపోవచ్చు. అదే, మీరు కాస్త ఎక్కువ ధర కొంటున్నట్లయితే తప్పసరిగా డస్ట్ ఫిల్టర్ ఉండేలా చూసుకోవడం మంచిదం టున్నారు. ముఖ్యంగా మీ అవసరాలను బట్టి ఒక ప్లేస్ నుంచి మరో ప్లేస్‌కు తీసుకెళ్లడానికి వీలుగా వీల్స్ ఉండే కూలర్లు ఎంచుకోవాలి. లేదంటే సెపరేట్‌గా మళ్లీ స్టాండ్ కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత మార్కెట్లో రకరకాల ఫీచర్లు కలిగిన కూలర్లు అందుబాటులోకి వస్తున్నాయి. సో కూలర్ కొనేటప్పుడు మీ ధరను బట్టి రిమోట్ కంట్రోల్ ఆప్షన్ ఉండేది తీసుకుంటే ఇంకా మంచిది. ఎందుకంటే రాత్రి వేళ్లలో స్వింగ్, కూల్, స్లీప్ టైమర్ వంటి ఆప్షన్లు ఎంచుకోవడం ఇది చాలా బాగా సహాయ పడుతుందంటున్నారు. కొన్నిసార్లు చాలా రోజులు కూలర్‌ను వాడకుండా అందులో నీటిని అలానే వదిలేస్తుంటాం. ఆ టైమ్‌లో అందులో ఉండే వాటర్ దోమలకు ఆవాసమవుతుంది. కాబట్టి, కూలర్ కొనుగోలు చేసేటప్పుడు దోమలు చొరబడకుండా అడ్డుకునే వ్యవస్థ ఉందేమో చూసుకోవడం ఇంకా మంచిదని సూచిస్తున్నారు నిపుణులు.

# మీ క్రెడిట్ స్కోర్ సరిగ్గా లేదా - అయినా, ఈ పద్ధతుల్లో “లోన్స్“ పొందవచ్చు!

## లోన్ మంజూరు కావాలంటే మెరుగైన క్రెడిట్ స్కోర్ కంపల్సరీ

## కానీ స్కోర్‌తో సంబంధం లేకుండా కూడా లోన్స్ పొందవచ్చు!




ఆర్థిక అవసరాలు ఎప్పుడు ఎలా వస్తాయో తెలియదు. పెద్ద మొత్తంలో డబ్బులు అవరసం పడినప్పుడు చాలా మంది రుణాల వైపు చూపుస్తారు. అయితే లోన్ తీసుకోవాలని బ్యాంక్‌లు లేదా ఫైనాన్స్ కంపెనీలకు వెళ్లినప్పుడు అక్కడి అధికారులు అడిగే ఫస్ట్ క్వశ్చన్ “మీ క్రెడిట్ స్కోర్ ఎంత?“. ఎందుకంటే ఎక్కువ క్రెడిట్ స్కోర్ ఉంటే లోన్ వచ్చే అవకాశం తొందరగా ఉంటుంది. అంతేకాకుండా వడ్డీ కూడా తక్కువే ఉంటుంది. అయితే చాలా మంది సిబిల్ స్కోర్ లేకపోతే బ్యాంకులు లోన్లు ఇవ్వవని ఫీల్ అవుతుంటారు. కానీ మీకు క్రెడిట్ స్కోర్ లేకపోయినా, తక్కువ ఉన్నా కొన్ని పద్ధతులు ఫాలో అయితే ఈజీగా లోన్ పొందవచ్చని నిపుణులు అంటున్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఈ స్టోరీలో చూద్దాం. గోల్డ్ లోన్స్: క్రెడిట్ స్కోర్‌తో పని లేకుండా ఈజీగా పొందగలిగే రుణాల్లో గోల్డ్ లోన్స్ ముందుంటాయి. బ్యాంకులు కూడా ఇటువంటి రుణాలు ఇవ్వడానికి ముందుకొస్తుంటాయి. క్రెడిట్ స్కోరుతో పనిలేకుండా తక్కువ వడ్డీతో అధిక మొత్తంలో రుణం పొందడానికి ఇది మంచి అవకాశం. ఇంకా, కేవలం ఒకటి లేదా రెండు రోజుల్లోనే లోన్ అప్రూవ్ అయ్యి డబ్బులు అకౌంట్లో జమ అవుతాయి.

**స్థిరాస్తి లోన్స్:**

రుణాలు కావాలనుకునేవారికి ఇంకో బెస్ట్ ఆప్షన్ స్థిరాస్తి లోన్. ఏదైనా రెసిడెన్షియల్ లేదా కమర్షియల్ ప్రాపర్టీ ఉంటే సిబిల్ స్కోర్ అవసరం లేకుండానే ఈజీగా లోన్ పొందొచ్చు. బ్యాంకులు, ఇతర ఫైనాన్స్ కంపెనీలు స్థిరాస్తులను హామీగా పెట్టుకుని తక్కువ వడ్డీ రేట్లకు రుణాలను అందిస్తున్నాయి. ఇలా ఆస్తి తనాఖా పెట్టి పొందే రుణాలు స్వయం ఉపాధి పొందుతున్న వ్యక్తులకు మంచి ఎంపిక. ఇలాంటి రుణాలపై వడ్డీ రేటు తక్కువ, రుణాన్ని తిరిగి చెల్లించడానికి టైమ్‌ని ఎంచుకునే అవకాశం ఉంటుంది.

**హామీదారుడి సాయంతో:** మెరుగైన క్రెడిట్ స్కోరు లేకపోయినా సరే, మీ కుటుంబ సభ్యుడిని లోన్‌కు హామీదారుగా ఉండమని మీరు కోరవచ్చు. అయితే, ఆ వ్యక్తికి మాత్రం మెరుగైన క్రెడిట్ స్కోరు ఉండాలి. అంతేకాకుండా అతని క్రెడిట్ స్కోర్ గురించి ఫైనాన్స్ కంపెనీలకు నిరూపించాల్సి ఉంటుంది. జ×దీ×ూ నేపథ్యం లేని వారు కూడా ఎడ్యుకేషన్ లేదా పర్సనల్ లోన్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి ఇది అత్యంత సాధారణ విధానం.

**జీవిత బీమా పాలసీపై:**

సరెండర్ విలువ కలిగిన లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీలను ఉపయోగించి క్రెడిట్ స్కోర్ లేకున్నా వ్యక్తిగత రుణాలను పొందవచ్చు. పాలసీ డాక్యుమెంట్‌పై రుణం పొందడానికి సిబిల్ స్కోర్ అవసరం లేదు. అయితే, ఈ రుణం పొందాలంటే పాలసీ తీసుకున్న వ్యక్తి కనీసం 3 సంవత్సరాలు ప్రీమియం చెల్లించాలి. దీని వల్ల లోన్ పొందడానికి ఈజీ అవుతుంది.

**అద్దె డిపాజిట్ కోసం:** అద్దెకు ఉండేవారు ఒక ఇంటి నుంచి మరో ఇంటికి మారుతున్నప్పుడు ఎక్కువ మొత్తం డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుంది. కొంతమందికి ఇది కూడా భారంగానే ఉంటుంది. ఇలాంటి ఖర్చులు చెల్లించడానికి మీవద్ద తగినంత నగదు లేకపోతే లోన్స్ కోసం ట్రై చేయవచ్చు. కొన్ని ఫైనాన్స్ సంస్థలు “రెంట్ డిపాజిట్“ రుణాలను అందిస్తాయి. ఇవి అన్‌సెక్యూర్డ్ రుణాలు. రుణ సంస్థలు ఇంటి ఓనర్‌కు నేరుగా చెల్లిస్తాయి. అయితే, ఈ రుణ సౌకర్యాన్ని ప్రత్యేకంగా ఇలాంటి అవసరాలకే రూపొందించారని గుర్తుంచుకోవాలి.


**పొదుపు ఖాతాపై ఓవర్‌డ్రాఫ్ట్:**

అనేక బ్యాంకులు లేదా రుణ సంస్థలు సేవింగ్స్ అకౌంట్స్‌పై ఓవర్‌డ్రాఫ్ట్ సౌకర్యాన్ని అందిస్తున్నాయి. అంటే పరోక్షంగా లోన్ ఇవ్వడమే. అకౌంట్ ఉన్నవారు ఓ టైమ్ వరకు వారి అకౌంట్‌లోని బ్యాలెన్స్ కంటే ఎక్కువ మొత్తాన్ని విత్‌డ్రా చేసుకోవడానికి ఇందులో ఆప్షన్ ఉంటుంది. ఈ ప్రీ-అప్రూవ్డ్ క్రెడిట్ లైన్‌కు సిబిల్ స్కోర్ అవసరం లేదు. అయితే, ఇది బ్యాంకుకు అకౌంట్ హోల్డర్‌కు ఉన్న సంబంధాలపై ఆధారపడి ఉంటుంది.

# స్టాక్ మార్కెట్లపై వార్ ఎఫెక్ట్- భారీ నష్టాల్లో సూచీలు

## భారీ నష్టాల్లో దేశీయ మార్కెట్ సూచీలు

## సెన్సెక్స్ 900 పాయింట్లకుపైగా డౌన్



పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ ప్రభావం దేశీయ సూచీలపై ఇంకా కొనసాగుతోంది. చమురు ధరల పెరుగుదలతో కారణంగా గురువారం మార్కెట్లు భారీ నష్టాల్లో ప్రారంభమయ్యాయి. ఎర్లీ ట్రేడింగ్‌లో సెన్సెక్స్ 990 పాయింట్లకిపైగా, నిఫ్టీ 300 పాయింట్లకి పైగా కోల్పోయాయి. ప్రస్తుతం సెన్సెక్స్ 897 పాయింట్లు కోల్పోయి 75,965 వద్ద ట్రేడ్ అవుతోంది. నిఫ్టీ 266 పాయింట్ల నష్టంతో 23,600 వద్ద కదలాడుతోంది. సెన్సెక్స్, నిఫ్టీ భారీ పతనంఎర్లీ ట్రేడింగ్‌లో బొంబాయి స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ సెన్సెక్స్ 992 పాయింట్లు నష్టపోయి 82,75,871 వద్ద ట్రేడ్ అయ్యింది. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజి సూచీ నిఫ్టీ 310 పాయింట్లు క్షీణించి 23,556 వద్ద ట్రేడ్ అయ్యింది. సెన్సెక్స్ సూచీలో టెక్ మహీంద్రా, ఎన్‌టీపీసీ, రిలియన్స్ ఇండస్ట్రీస్ షేర్లు లాభాల్లో కొనసాగుతున్నాయి. అదే సమయంలో ఎటర్నల్, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్, మహీంద్రా అండ్ మహీంద్రా, ఆదానీ పోర్ట్స్, టైటాన్ కంపెనీ, ఐసీఐసీఐ బ్యాంక్ నష్టాల్లో ట్రేడ్ అవుతున్నాయి.

**జీవనకాల కనిష్ఠానికి రూపాయి విలువ**

అంతర్జాతీయ విపణిలో దేశీయ కరెన్సీ రూపాయి విలువ జీవనకాల కనిష్ఠానికి పడిపోయింది. అమెరికా డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 31 పైసలు కోల్పోయి 92.32 వద్ద కొనసాగుతోంది.

**ఆసియా మార్కెట్లలోనూ నష్టాలు**

మరోవైపు ఆసియా స్టాక్ మార్కెట్లు కూడా భారీ నష్టాల్లో కొనసాగుతున్నాయి. దక్షిణ కొరియాకు చెందిన కోస్పీ, జపాన్‌కు చెందిన నిక్కీ, షాంఘైకు చెందిన ఎస్ఎస్ఈ కాంపోజిట్ ఇండెక్స్, హాంకాంగ్‌కు చెందిన హాంగ్ సెంగ్ ఇండెక్స్ సుచీలు నష్టాల్లో ట్రేడ్ అయ్యాయి. ఇక అమెరికా మార్కెట్లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నాస్‌డాక్ మినహా మిగతా అన్ని సూచీలు పడిపోయాయి.

**ముడి చమురు ధరలు భారీగా పెరుగుదల**

ప్రపంచ మార్కెట్‌లో చమురు ధరలకు ప్రమాణంగా భావించే బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర 8.98 శాతం పెరిగి బ్యారెల్‌కు 100.24 డాలర్లకు చేరింది. అయితే ప్రపంచ ఇంధన సంస్థ(ఐఈఏ) 400 మిలియన్ బ్యారెళ్ల అత్యవసర చమురు నిల్వలు విడుదలకు అంగీకరించినా చమురు ధరలకు అడ్డుకట్ట పడలేదు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర ఈ ఉదయం బ్యారెల్‌కు 100 డాలర్ల మార్కును దాటింది. అమెరికా బెంచ్ మార్క్ క్రూడ్ ధర కూడా బ్యారెల్‌కు సుమారు 94 డాలర్లకు చేరుకుంది. హర్మూజ్ జలసంధి సమీపంలో వాణిజ్య నౌకలపై ఇరాన్ దాడులు చేయడంతో చమురు ధరలు భారీగా పెరుగుతున్నాయి. పెరుగుతున్న ధరలను అరికట్టడానికి వచ్చే వారం తన వ్యూహాత్మక పెట్రోలియం రిజర్వ్ నుంచి 172 మిలియన్ బ్యారెళ్ల చమురును విడుదల చేయాలని అమెరికా యోచిస్తోంది. చమురు ధరల పెరుగుదలతో ప్రపంచవ్యాప్తంగా స్టాక్ మార్కెట్లు కూడా కుదేలయ్యాయి.

**విదేశీ పెట్టుబడిదారుల భారీ అమ్మకాలు**

స్టాక్ ఎక్స్ఛేంజ్ డేటా ప్రకారం విదేశీ పెట్టుబడిదారులు రూ. 6,267.31 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు. ఇక దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు రూ. 4,965.53 కోట్ల విలువైన షేర్లను కొనుగోలు చేశారు.

**బంగారం, వెండి ధరలు ఇలా!**

ప్రపంచ వ్యాప్తంగా అనిశ్చితి మధ్య మార్కెట్లలో విలువైన లోహాలు పెరిగాయి. 24 క్యారెట్ల స్వచ్ఛమైన 10 గ్రాముల బంగారం ధర రూ.1,61,629 ట్రేడ్ అవుతుంది. కిలో వెండి ధర రూ.2,67,121కు చేరింది. గురువారం పశ్చిమాసియాలో సూచీలు పడిపోవడానికి చమురు ధరలతో పాటు టారిఫ్‌లపై అమెరికా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కూడా ప్రభావం చూపింది. అన్యాయమైన వాణిజ్య పద్ధతులను అనుసరిస్తున్నారని ఆరోపిస్తూ భారత్‌తో సహా 16 దేశాల ఆర్థిక వ్యవస్థలపై దర్యాప్తునకు ఆదేశించింది. కొత్త టారిఫ్‌లు విధించేందుకు ఇది మరో మార్గం కానుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ నిర్ణయం కూడా మదుపర్లపై ఒత్తిడి పెంచింది.

# హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకుంటున్నారా...

## ఈ విషయాలు తెలుసుకుంటే మంచిది!

## పెరిగిన వైద్య ఖర్చుల నిమిత్తం కీలకంగా ఆరోగ్య బీమా

## బీమా తీసుకునేటప్పుడు ఈ విషయాలు గుర్తుంచుకోవాలంటున్న

నేటి రోజుల్లో వైద్యం చాలా ఖర్చుతో కూడుకున్న అంశం. జ్వరం నుంచి పెద్ద సర్జరీల వరకు లక్షల్లో ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి. అందుకే హెల్త్ ఇన్సూరెన్స్ అనేది చాలా ముఖ్యం. కానీ ఇప్పటికీ చాలా మంది దీనిని అవసరం లేని ఖర్చుగా భావిస్తున్నారు. మాకు ఏమవుతుందిలే అని నిర్లక్ష్యం వహిస్తున్నారు. కానీ వాస్తవానికి, ఆరోగ్య బీమా అనేది ఒక రక్షణ కవచం అని నిపుణులు అంటున్నారు. అనుకోని ఆరోగ్య సమస్యల సమయంలో మనకు రక్షణగా నిలబడి ఆర్థిక భద్రతను కలిగిస్తుందని అంటున్నారు. అయితే ఏ ప్లాన్ పడితే అది కొనుగోలు చేయకూడదని.. మన అవసరాలకు తగినట్లుగా తీసుకోవాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలోనే దేశీయ దిగ్గజ బ్యాంక్ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు విషయంలో కొన్ని టిప్స్ సూచిస్తోంది. ఆ వివరాలు ఈ స్టోరీలో చూద్దాం.

**హెల్త్ పాలసీ ఎందుకు అవసరం :** సాధారణంగా వచ్చే జలుబు, జ్వరం నుంచి గుండె సమస్యలు, శస్త్ర చికిత్సలు వరకు అన్నింటికీ వేల నుంచి లక్ష రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇలాంటి సమయంలో హెల్త్ పాలసీ ఉంటే ఆసుపత్రి ఖర్చులు తగ్గుతాయని, జేబు ఖాళీ కాకుండా, అప్పుల పాలవకుండా ఉంటామని అంటున్నారు. క్యాష్‌లెస్ హాస్పిటలైజేషన్, ఫ్యామిలీ కవర్, ట్యాక్స్ మినహాయింపు వంటి ప్రయోజనాలు కూడా ఉండటంతో హెల్త్ పాలసీ తీసుకోవడం ప్రతి ఒక్కరికీ అవసరమని నిపుణులు సూచిస్తున్నారు.

**సరైన కవరేజ్ ఎంచుకోవడం:** హెల్త్ ఇన్సూరెన్స్ విషయంలో మొదటిగా పరిగణనలోకి తీసుకోవాల్సినది కవరేజ్. ఆసుపత్రి ఖర్చులు (డాక్టర్ ఫీజు, రూమ్ రెంట్), హాస్పిటల్‌లో చేరే ముందు, డిశ్చార్జ్ తర్వాత, అవుట్ పేషెంట్ సర్వీసెస్, క్యాన్సర్, గుండెపోటు, కిడ్నీ ఫెయిల్యూర్ వంటి పెద్ద జబ్బులకు అయ్యే ఖర్చులు కూడా కవర్ అయ్యేలా ప్లాన్ ఎంచుకోవాలి.

**ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్స్:** విడివిడిగా ఒక్కొక్కరు పాలసీలు తీసుకునే బదులు ఫ్యామిలీ ఫ్లోటర్ ప్లాన్ తీసుకోవడం మంచిదంటున్నారు. అంటే ఒక పాలసీ కింద కుటుంబ సభ్యులందరికీ పాలసీ కవర్ అవుతుంది. ప్రతి ఒక్కరికీ విడివిడిగా పాలసీలు తీసుకోవడం కంటే, అందరికీ కలిపి ఒకే ప్లాన్ తీసుకోవడం వల్ల ప్రీమియం ఖర్చు చాలా తగ్గుతుంది.

**సరైన బీమా మొత్తం:** హెల్త్ ఇన్సూరెన్స్‌లో బీమా మొత్తం (ాబఎ ×అంబతీవ‌ు) అనేది మీరు అనారోగ్యం పాలైనప్పుడు ఇన్సూరెన్స్ కంపెనీ గరిష్టంగా చెల్లించే డబ్బు. పెద్ద పట్టణాల్లో నివసిస్తోన్న వారు అయితే ఎక్కువ మొత్తంలో, చిన్న పట్టణాల్లో ఉండే వారి అయితే మధ్యస్థంగా కవరేజ్ ఉండేలా చూసుకోవాలని చెబుతున్నారు. అదే విధంగా భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొంచెం ఎక్కువ మొత్తాన్ని ఎంచుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

**లైఫ్‌టైమ్ రెన్యువబిలిటీ:** హెల్త్ ఇన్సూరెన్స్‌లో “లైఫ్ టైమ్ రెన్యూవబిలిటీ“ అనేది అత్యంత కీలకమైనదని నిపుణులు చెబుతున్నారు. అంటే ఈ ఆప్షన్ ద్వారా మీరు ఒకసారి హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ




తీసుకుంటే, మీ వయసుతో సంబంధం లేకుండా జీవితాంతం ఆ పాలసీని కొనసాగించే హక్కు మీకు ఉంటుంది. కాబట్టి పాలసీ కొనుగోలు చేసేముందు ఈ ఆప్షన్ ఎంచుకుంటే మంచిదంటున్నారు.

**క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో:** హెల్త్ ఇన్సూరెన్స్‌లో మరో ముఖ్యమైన అంశం క్లెయిమ్ సెటిల్‌మెంట్ రేషియో. అంటే ఒక ఆర్థిక సంవత్సరంలో ఒక ఇన్సూరెన్స్ కంపెనీకి వచ్చిన మొత్తం క్లెయిమ్‌లలో, ఆ కంపెనీ ఎన్ని క్లెయిమ్‌లను అప్రూవ్ చేసి డబ్బులు చెల్లించిందో తెలిపే పద్ధతే ఇది. కాబట్టి పాలసీ కొనుగోలు చేసేముందు ఆ కంపెనీ జు= ఎంత ఉందో చూడటం ముఖ్యముంటున్నారు. ఎక్కువ పర్సంటేజ్ ఉన్న వాటిని ఎంచుకుంటే క్లెయిమ్ ప్రాసెస్ కూడా ఫాస్ట్‌గా ఉంటుంది.

**వెయిటింగ్ పీరియడ్:** కొన్ని బీమా పాలసీల్లో కొన్ని వ్యాధుల కోసం 2-4 సంవత్సరాల వెయిటింగ్ పీరియడ్ ఉంటుంది. అంటే, పాలసీ తీసుకున్న వెంటనే ఆ ప్రయోజనాలు అందవు. కాబట్టి వాయిదా కాలం ఎంత ఉంది? అనే విషయంపై స్పష్టత ఉండాలి. పాలసీ కొనేముందు ఈ విషయాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.

**ఇవి కూడా :**

ఆసుపత్రిలో చికిత్స అనంతరం బీమా క్లెయిమ్ చేయడంలో మీ పాలసీ ఎంత సులభతరంగా పని చేస్తుంది అనేది తెలుసుకోవాలని చెబుతున్నారు. మీ పాలసీ కవర్ తక్కువగా ఉన్నప్పుడు, అదనంగా టాప్-అప్ పాలసీని తీసుకోవచ్చు. ఇది అధిక ఆరోగ్య ఖర్చులను తక్కువ ఖర్చుతో కవరేజ్ ఇస్తుంది. సంవత్సరం వ్యవధిలో క్లెయిమ్ లేకుండా పాలసీ కొనసాగితే, కొన్ని కంపెనీలు నో-క్లెయిమ్ బోనస్ ఇస్తాయి. అంటే ఇన్సూరెన్స్ కవర్ పెరుగుతుంది. కాబట్టి కొత్తగా హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలు చేసేవారు ఈ విషయాలు తెలుసుకుంటే మంచిదంటున్నారు.



# 'వృష కర్మ' కోసం బీస్ట్ మోడ్‌లోకి మారిన నాగ చైతన్య

## 6 ప్యాక్ లుక్‌తో ఫ్యాన్స్‌కి షాక్ ఇచ్చిన చైతు

అక్కినేని వారసుడిగా టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న యువ హీరో నాగ చైతన్య ప్రస్తుతం వరుసగా వైవిధ్యమైన కథలతో ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. తాజాగా ఆయన హీరోగా తెరకెక్కుతున్న ఇంట్రెస్టింగ్ థ్రిల్లర్ చిత్రం వృషకర్మపై ఇప్పటికే మంచి ఆసక్తి నెలకొంది. ఈ సినిమాలో హీరోయిన్‌గా మీనాక్షి చౌదరి నటిస్తుండగా, టాలెంటెడ్ దర్శకుడుకార్తీక్ వర్మ ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. ఇటీవల విడుదలైన 'వృష కర్మ' గ్లింప్స్ ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించింది. థ్రిల్లర్ ఎలిమెంట్స్‌తో కూడిన ఈ సినిమా థియేటర్లలో సాలిడ్ ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తుందని మేకర్స్ హామీ ఇచ్చారు. ముఖ్యంగా ఈ సినిమాలో నాగ చైతన్య పూర్తిగా కొత్త లుక్‌లో కనిపించబోతుండటం అభిమానుల్లో ఆసక్తిని మరింత పెంచుతోంది. తాజాగా నాగ చైతన్య సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు వైరల్‌గా మారాయి. "దీవఅఅస్త్రాతీయబఅ" అనే క్యాప్షన్‌తో ఆయన జిమ్‌లో తీసుకున్న ఒక ఫోటోను పోస్ట్ చేశాడు. ఆ ఫోటోలో చైతు 6 ప్యాక్ బాడీతో స్టైలిష్‌గా కనిపించడం అభిమానులను ఆశ్చర్యపరిచింది. డంబెల్స్ పట్టుకుని వర్కౌట్ చేస్తున్న ఫోటో ద్వారా ఈ సినిమా కోసం ఎంత కష్టపడుతున్నాడో చూపించాడు. ఇటీవల వచ్చిన తండేల్ సినిమాలో నాగ చైతన్య డీ-గ్లామరస్ లుక్‌లో కనిపించిన సంగతి తెలిసిందే. అయితే 'వృష కర్మ' కోసం మాత్రం పూర్తిగా స్టైలిష్ మరియు ఫిట్ లుక్‌లోకి మారడం విశేషంగా మారింది. నాగ చైతన్య ఈ ఫోటోలను షేర్ చేసిన కొద్ది నిమిషాల్లోనే సోషల్ మీడియాలో ట్రెండ్ అయ్యాయి. హీరో సుశాంత్ వంటి సెలబ్రిటీలు కూడా ఈ పోస్ట్‌పై స్పందించగా, వేలాది మంది అభిమానులు ఫైర్ ఎమోజీలు, లైక్స్‌తో కామెంట్స్ సెక్షన్‌ను హోరెత్తించారు. "అన్నా నీ మూవీ కోసం వెయిటింగ్", "వృషకర్మ ఇన్ యాక్షన్", "చైతు ట్రాన్స్‌ఫర్మేషన్ సూపర్" అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. అలాగే ఈ కొత్త లుక్‌కు కారణమైన ఫిట్‌నెస్ ట్రైనర్ కూడా స్పందిస్తూ, "నీ ఈ ట్రాన్స్‌ఫర్మేషన్‌లో నా వంతు పాత్ర ఉన్నందుకు సంతోషంగా ఉంది" అని రిప్లై ఇవ్వడం అభిమానుల దృష్టిని ఆకర్షించింది. ఇదిలా ఉండగా నాగ చైతన్య సెట్స్‌కి సంబంధించిన మరికొన్ని ఫోటోలు కూడా షేర్ చేశారు. షూటింగ్ లొకేషన్స్‌లో తీసిన ఈ చిత్రాలు కూడా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. దీంతో 'వృష కర్మ' సినిమాపై అభిమానుల్లో మరింత ఆసక్తి పెరిగింది.




# అక్షయ్ కుమార్ 'భూత్ బంగ్లా' టీజర్ విడుదల

బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, దర్శకుడు ప్రియదర్శన్ కాంబినేషన్‌లో వస్తున్న మోస్ట్ అవైటెడ్ హారర్-కామెడీ చిత్రం 'భూత్ బంగ్లా'. సుమారు 14 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత వీరిద్దరి కాంబోలో ఈ సినిమా వస్తుండటంతో భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే తాజాగా ఈ చిత్రం నుంచి టీజర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. గతంలో వీరిద్దరి కలయికలో వచ్చిన 'భూల్ భులైయా' వంటి క్లాసిక్ సినిమాను గుర్తు చేస్తూ, భయం మరియు నవ్వుల మేళవింపుతో ఈ టీజర్ ఆద్యంతం ఆసక్తికరంగా సాగింది. మంగళపూర్ అనే గ్రామంలోని 'వధుసురుడు' అనే మిస్టరీ చుట్టూ ఈ సినిమా కథ తిరుగుతుందని టీజర్ ద్వారా చిత్ర బృందం స్పష్టం చేసింది. ఈ చిత్రంలో అక్షయ్ కుమార్‌తో పాటు టబు, పరేష్ రావల్, రాజ్‌పాల్ యాదవ్, వామిఖ గబ్బి, మిథిలా పాల్కర్ వంటి భారీ తారాగణం నటిస్తుండగా, ప్రీతమ్ అద్భుతమైన సంగీతాన్ని అందించారు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో కీలక సన్నివేశాల చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఏప్రిల్ 10న వరల్డ్ వైడ్‌గా విడుదల కాబోతుంది.




# ఎప్‌స్టీన్ ఫైల్స్‌తో నాకు సంబంధం లేదు బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్

ప్రపంచవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'ఎప్‌స్టీన్ ఫైల్స్' వివాదంలో తన పేరు వినిపించడంపై ప్రముఖ బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ కశ్యప్ తీవ్రంగా స్పందించారు. అమెరికన్ బిలియనీర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ లైంగిక అక్రమ రవాణా కేసులో బయటపడిన పత్రాలలో తన పేరు ఉందంటూ జరుగుతున్న ప్రచారాన్ని ఆయన పూర్తిగా తోసిపుచ్చాడు. తనకు ఆ ఫైల్స్‌తో కానీ, అందులో ఉన్న ఈమెయిల్స్‌తో కానీ ఎటువంటి సంబంధం లేదని అనుగార్ క్లారిటీ ఇచ్చాడు. 2017లో ఎప్‌స్టీన్ నిర్వహించిన ఒక ఈవెంట్ కోసం తాను బీజింగ్ వెళ్లాననే వార్తల్లో నిజం లేదని, అసలు తన జీవితంలో ఇప్పటివరకు బీజింగ్‌నే సందర్శించలేదని అనురాగ్ అన్నారు. 2014 కంటే ముందు కేవలం సినిమా లొకేషన్ల కోసం ఒక్కసారి మాత్రమే చైనా వెళ్లానని, అది కూడా శంఘైకి మాత్రమేనని వివరించారు. ఒక వక్తగా తనకు అనేక ఆహ్వానాలు వస్తుంటాయని, అంతమాత్రాన ఆ ఈవెంట్లతో తనకు సంబంధం ఉన్నట్లు కాదని ఆయన పేర్కొన్నారు. తన సినిమాల కంటే ఇలాంటి అనవసర పుకార్ల ద్వారానే తన పేరు ఎక్కువగా చర్చకు రావడంపై ఆయన అసహనం వ్యక్తం చేస్తూ, కేవలం ఏదో ఒక ఈమెయిల్‌లో పేరు కనిపించినంత మాత్రాన నిందలు వేయడం సరికాదని కొట్టిపారేశారు. అమెరికన్ బిలియనీర్ జెఫ్రీ ఎప్‌స్టీన్ మైనర్ బాలికలను ట్రాప్ చేసి, ఒక భారీ లైంగిక అక్రమ రవాణా నెట్‌వర్క్‌ను నడిపిన వ్యవహారానికి సంబంధించిన కీలక పత్రాలనే 'ఎప్‌స్టీన్ ఫైల్స్' అంటారు. ప్రపంచ దేశాల అధ్యక్షులు, వ్యాపారవేత్తలు, మరియు సినీ ప్రముఖులతో సన్నిహిత సంబంధాలు కలిగిన ఎప్‌స్టీన్, 2019లో అరెస్టయి జైలులోనే అనుమానాస్పదంగా మరణించారు. ఇటీవల అమెరికా కోర్టు బహిర్గతం చేసిన సుమారు 900 పేజీల ఈ పత్రాల్లో ఎప్‌స్టీన్ ప్రైవేట్ ద్వీపానికి వెళ్లిన వారు, ఆయన విమానాల్లో ప్రయాణించిన ప్రముఖుల పేర్లు, కాల్ రికార్డులు మరియు బాధితుల సాక్ష్యాలు ఉన్నాయి. ఈ జాబితాలో బిల్ క్లింటన్, డొనాల్డ్ ట్రంప్, బ్రిటన్ ప్రిన్స్ ఆండ్రూ వంటి అగ్రనేతల పేర్లు ప్రస్తావనకు రావడంతో అంతర్జాతీయంగా సంచలనం రేగింది. ఈ ఫైల్స్‌లో పేరు ఉన్నంత మాత్రాన వారంతా నేరస్తులు కాకపోయినా, ఎప్‌స్టీన్ నడిపిన చీకటి సామ్రాజ్యంతో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయనే చేదు నిజాలు ఈ పత్రాల ద్వారా బయటపడుతున్నాయి.




# 'ధురంధర్' నుంచి అదిరిపోయే అప్‌డేట్.. ఐకానిక్ 'ఆరి ఆరి' సాంగ్ విడుదల




బాలీవుడ్ స్టార్ హీరో రణ్‌వీర్ సింగ్, సెన్సేషనల్ డైరెక్టర్ ఆదిత్య ధర్ కలయికలో తెరకెక్కిన భారీ స్పై యాక్షన్ థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' బాక్సాఫీస్ వద్ద ప్రకంపనలు సృష్టించేందుకు సిద్ధమవుతోంది. ఈ క్రేజీ సీక్వెల్‌కు సంబంధించి అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న 'ఆరి ఆరి' సాంగ్‌ను చిత్రబృందం నేడు విడుదల చేసింది. 2003 నాటి పాపులర్ బాంబే రాకర్స్ పాటను శాశ్వత్ సచ్‌దేవ్ ఆధునిక బీట్స్‌తో రీమిక్స్ చేయగా, రణ్‌వీర్ సింగ్ పవర్‌ఫుల్ స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఈ పాట విజువల్స్ అదరగొడుతున్నాయి. ఇప్పటికే విడుదలైన ట్రైలర్ 310 మిలియన్లకు పైగా వ్యూస్‌తో రికార్డులు సృష్టించగా, తాజాగా విడుదలైన ఈ సాంగ్ సినిమాపై అంచనాలను మరింత రెట్టింపు చేసింది. దాదాపు రూ.400 కోట్ల భారీ బడ్జెట్‌తో రూపొందిన ఈ చిత్రంలో రణ్‌వీర్ సింగ్ జస్కిరాత్ సింగ్ రంగీ మరియు హమ్జా అనే రెండు విభిన్న పాత్రల్లో ద్విపాత్రాభినయం చేయబోతున్నాడు. అర్జున్ రాంపాల్, సంజయ్ దత్, ఆర్ మాధవన్ వంటి అగ్ర నటులు కీలక పాత్రల్లో కనిపిస్తున్న ఈ చిత్రం భారత గూఢచారి వ్యవస్థ చుట్టూ సాగే హై-వోల్టేజ్ డ్రామాగా రూపొందింది. ప్రపంచవ్యాప్తంగా ఉగాది, ఈద్ పండుగల సందర్భంగా మార్చి 19, 2026న హిందీతో పాటు తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషల్లో ఈ సినిమా గ్రాండ్‌గా విడుదల కానుంది. ఇక మార్చి 18 సాయంత్రం నుంచే భారీ ఎత్తున పెయిడ్ ప్రివ్యూలు ప్రదర్శించనుండగా, అడ్వాన్స్ బుకింగ్స్‌లో ఇప్పటికే ఈ చిత్రం 'స్త్రీ 2' రికార్డులను అధిగమించి ఆల్-టైమ్ రికార్డ్ దిశగా దూసుకుపోతోంది.

# ఆసక్తికరంగా 'దీవాన' టీజర్

టాలీవుడ్ యువ నటుడు హర్షిత్ రెడ్డి హీరోగా, స్నేహ మణిమేగలై హీరోయిన్‌గా నటిస్తున్న చిత్రం 'దీవాన'. ఈ చిత్ర టీజర్‌ను నేడు విడుదల చేశారు మేకర్స్. టీజర్ ఆరంభం నుంచి ముగింపు వరకు చాలా ఇంటెన్స్‌గా సాగింది. ఒక యువకుడు ప్రేమలో పడి, ఆ ప్రేమ కోసం ఏ స్థాయికైనా వెళ్లే 'దీవాన' గా ఎలా మారాడనేది ఈ చిత్ర ప్రధానాంశం. ముఖ్యంగా "ఎంత అందంగా ఉంటే అంత సతాయిస్తారురా పోరీలు" మరియు "అది నీ ప్రాణం పీక్క తినకపోతే నన్ను అడుగురా" వంటి డైలాగులు యువతను బాగా ఆకట్టుకుంటున్నాయి. తెలంగాణ అర్బన్ నేపథ్యంలో సాగే ఈ స్వచ్ఛమైన మరియు ఇంటెన్స్ లవ్ స్టోరీలో హర్షిత్ రెడ్డి తన నటనతో మరియు డైలాగ్ డెలివరీతో ఆకట్టుకున్నాడు. ఈ సినిమాకు శ్రీకాంత్ సంగిశెట్టి దర్శకత్వం వహించగా.. అర్హ మీడియా, వీ స్టూడియోస్ బ్యానర్స్‌లపై వాసుదేవ్ కొప్పినేని, శ్రీదేవి కార్యంపూడి సంయుక్తంగా నిర్మిస్తున్నారు. సమ్మర్ కానుకగా ఏప్రిల్ 14న ఈ చిత్రం రాబోతుండగా.. ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ ఈ మూవీని డిస్ట్రిబ్యూషన్ చేస్తుంది.

The Publisher, Editor seggem kiran kumar 8-6-128/m,TKR collage road , Nandanavanam colony, kharmanghat,Rangareddy, Telangana - 500079.
mail : vaarthasandhya@gmail.com, www.vaarthasandhya.com epaper.vaarthasandhya.com. Cell : 73961 22101 , 99517 51662.